సిబ్బంది.. అరకొర







- జిల్లా కార్యాలయాల్లో నిష్పత్తి ప్రకారం లేని ఉద్యోగులు
- ఇంకా పరిష్కారం కాని ఉమ్మడి జిల్లాల తకరారు
- ముంచుకొస్తున్న ఎన్నికలు.. అరకొర సిబ్బందితో కష్టమే
- నిధుల విడుదలలోనూ ఎదురుచూపులే

బాపట్ల, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): ఇంకో రెండునెలలు దాటితే బాపట్ల జిల్లాగా ఆవిర్భవించి రెండేళ్లు పూర్తవుతాయి. అయినప్పటికీ ఇంకా బాలారిష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. ముఖ్యంగా జిల్లా కార్యాలయాల్లో సిబ్బంది ఇప్పటికీ అరకొరగానే ఉన్నారు. సమీపదూరంలో ఎన్నికలు సమీపిస్తుండడంతో చాలీచాలని సిబ్బందితో ఎలా అని జిల్లా అధికారులు మదనపడుతున్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ జిల్లాలో అత్యంత వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. ముఖ్యంగా పర్చూరు నియోజకవర్గం అయితే నిత్యం వార్తల్లో నిలిచింది. దాదాపు రెవెన్యూ సిబ్బంది అంతా ఆ విధుల్లోనే నిమగ్నమైనప్పటికీ తుది ప్రచురణలో కోకొల్లలుగా తప్పులు వెలుగు చూస్తున్నాయి. తొలి నుంచి సిబ్బంది విషయంలో కొరత ఎదుర్కొంటున్నామని, కానీ పరిష్కరించాల్సిన దరఖాస్తులు లక్షల్లో ఉన్నాయనే ఆవేదనను అప్పుడే వారు వెలిబుచ్చారు. జాబితాలో పొరపాట్లు దొర్లడానికి ఇదే ప్రధాన కారణమనే అభిప్రాయం ఇప్పుడు వ్యక్తమవుతోంది.

ఏ కార్యాలయంలోనూ సరిపడా లేరు..

జిల్లా కార్యాలయాల్లో ఏ ఒక్కచోట ఉండాల్సిన నిష్పత్తిలో సిబ్బంది లేరు. ఎన్నికల ప్రక్రియలో రెవెన్యూ సిబ్బందితో పాటు నాన్ రెవెన్యూ ఉద్యోగులను సైతం రిజర్వ్ సిబ్బందిగా కేటాయించడమో లేక ఇతరత్రా విధులకు ఉపయోగించుకుంటూ ఉంటారు. జిల్లా కార్యాలయాలన్నింటిలో కలిపి దాదాపు 300 వరకు సిబ్బంది కొరత ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో రెవెన్యూ వాటా వందకు పైన ఉండగా మిగిలిన విభాగాలు అన్నీ కలిపి 200 వరకు కొరత ఉండొచ్చని సమాచారం. ఉదాహరణకు జిల్లా మార్కెటింగ్ విభాగంలో దాదాపు పది మంది సిబంది నియామకం చేపట్టాల్సి ఉండగా, అరకొర సిబ్బందితోనే లాగిస్తున్నారు. అత్యంత కీలక హౌసింగ్ విభాగానిది అదేదారి. ఎన్నికల సమయంలో సిబ్బంది అందరినీ ఏదో ఒక విధులకు కేటాయిస్తున్నారు. రెవెన్యూలో చాలామందిని ఇప్పటికే కలెక్టరేట్ అవసరాల కోసం ఉపయోగించుకుంటున్నారు. దీంతో తహసీల్దార్ కార్యాలయాల్లో పనులు పడకేస్తున్నాయనే విమర్శఉంది. ఉన్న సిబ్బంది మొత్తం ఎన్నికల విధుల్లోనే నిమగ్నమవడంతో ప్రజల సమస్యలు పూర్వపక్షం అయ్యాయనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

తొందరగా తేలిస్తేనే...

చాలా విషయాల్లో ఉమ్మడి జిల్లాల తకరారు నడుస్తుండడంతో సిబ్బంది విషయంలో పాటు జిల్లా అధికారుల విషయంలో స్పష్టత రావడం లేదు. ఇప్పటికీ కీలక ఖాతాలు ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికనే కొనసాగుతుండడం విశేషం. వారంలో మూడురోజులు ఎన్నికల సన్నద్ధతలోనే యంత్రాంగం మునిగిపోయి ఉంటుంది. ప్రస్తుతానికి నోటిఫికేషన్ విడుదల కానందున రెవెన్యూ విభాగమే ఎన్నికల సన్నాహక ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. నోటిఫికేషన్ అంటూ విడుదల య్యాక అన్ని విభాగాల ఉద్యోగులను ఆ క్రతువులో భాగస్వామ్యం చేయాల్సి ఉంటుంది. ఈలోగానే ఉమ్మడి జిల్లాల పంచాయితీని త్వరగా తేల్చుకుని నిష్పత్తి ప్రకారం ఆయా కార్యాలయాలకు కేటాయించాల్సిన సిబ్బందిని నియమించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తేనే ఎన్నికల అంకం సజావుగా ముగుస్తుంది.

నిధుల విషయంలోనూ ఎదురుచూపులే..

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఫాం7లకు సంబంధించి రిజిస్టర్ పోస్టుల ద్వారా నోటీసులు పంపించడం తిరిగి వాటికి సమాధానం తీసుకోవడం ఇతరత్రా ఖర్చులన్నీ కలిసి రెవెన్యూ విభాగానికి తడిసి మోపెడైంది. ఇప్పటికీ ఒక్క రూపాయి ప్రభుత్వ ఖజానానుంచి విడుదల కాలేదు. ఎన్నికల అంకం కూడా మరి కొన్ని రోజుల్లో ప్రారంభం కానుండడంతో నిధుల కొరత వెంటాడుతూనే ఉంది. ప్రభుత్వం ఆదేశాలివ్వడంతోనే సరిపెడుతోంది తప్ప నిధుల మంజూరు విషయంలో పట్టనట్లు వ్యవహరిస్తోందని యంత్రాంగం వాపోతోంది. ఎన్నికల వేళ నిధుల విషయంలో ప్రభుత్వంగా ఉదారంగా వ్యవహరించకపోతే ఆ ప్రభావం ప్రక్రియ మీద పడే అవకాశముందని సిబ్బంది చెబుతున్నారు.

గెజిటెడ్ ర్యాంకు ఆఫీసర్ల అవసరం..

ఎన్నికల విధుల్లో ఎక్కువగా గెజిటెడ్ ఆఫీసర్ల అవసరం ఉంటుంది. మొన్నటి వరకు ఆయా విభాగాలకు సంబంధించి జిల్లాస్థాయి అధికారులుగా నేరుగా ఉంది కేవలం నలుగురు మాత్రమే కావడం గమనార్హం. తాజాగా జరిగిన బదిలీల్లో మరో 5 గురు ఆ స్థాయి అధికారులు వివిధ విభాగాలకు అధిపతులకు జిల్లాకు వచ్చారు. సిబ్బంది వివరాలతో పాటు గెజిటెడ్ అధికారుల సంఖ్య ఇతరత్రా అంశాలతో ఎన్నికల కమిషన్‌కు శనివారం నివేదికను జిల్లా అధికారులు పంపినట్లు సమాచారం.

అడుగంటిన చెరువు

- వేసవి రాక ముందే బాపట్లకు నీటి కష్టాలు
- ఆరు రోజులకు సరిపడ మాత్రమే నీటి నిల్వలు
- ఇక నుంచి రోజు మార్చి రోజు మున్సిపల్ నీటి సరఫరా


సమ్మర్ స్టోరేజి ట్యాంక్

బాపట్ల, ఫిబ్రవరి 3: వేసవి రాలేదు.. అప్పుడే బాపట్లవాసులకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. పాలకుల అలక్ష్యం.. అధికారుల నిర్లక్ష్యంతో చెరువులో నీరు అడుగంటింది. కేవలం 10 అడుగులు మాత్రమే ఉన్న నీటిలో కేవలం 3 అడుగుల నీటిని మాత్రమే తాగునీటికి వినియోగిస్తారు. మిగిలిన 7 అడుగులు సిల్ట్‌తో కూడిన మురుగు తాగునీటి సరఫరాకు పనికిరాదు. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు చూస్తే ఆరు రోజుల వరకే వస్తాయి. ఆ తర్వాత ఏమిటి అనే ఆందోళన మొదలైంది. అయినా చెరువులో నీరు పెట్టే ఆలోచన అధికారులు చేయకపోవడం పట్టణ ప్రజల పాలిట శాపంగా మారింది. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్న చందంగా చెరువులో నీరు డెడ్ స్టోరేజికి వెళ్లడంతో అధికారులు చెరువును పరిశీలించి ఇక నుంచి ప్రజలకు రోజు మార్చిరోజు నీటి సరఫరా చేయాలని నిర్ణయించారు. ఈవిధంగా చేసినా కేవలం 12 రోజులకు మాత్రమే నీరు సరిపోతుంది. సాంకేతిక కారణాల వల్ల పీటీ ఛానల్‌కు నీరు రావడం ఆలస్యమైందని మున్సిపల్ డీఈ కె.శ్రీనివాసులు చెబుతున్నారు. ఓ వైపు నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయంటూ మరోవైపు సాంకేతిక సమస్యలు అంటూ పొంతన లేని మాటలు చెబుతుండటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు విస్తరణ పనుల సమయంలో 100 చోట్లకు పైగా పైపులైన్‌లు పగలగొట్టారు. దీంతో చెరువులో నీరు అటు ప్రజలకు చేరకుండా ఇటు చెరువులో ఉండకుండా వృథా అయ్యింది. ఇష్టానుసారంగా గుంతలు తవ్వి పైపులు పగలగొట్టి నీటిని వృథా చేసిన కాంట్రాక్టర్, మున్సిపల్ అధికారులపై పెద్దఎత్తున విమర్శలు వస్తున్నాయి.

ప్రజలు సహకరించాలి : మున్సిపల్ డీఈ

చెరువులో నీరు డెడ్ స్టోరేజికి వెళ్ళినందున ప్రజలు అధికారులకు సహకరించాలని డీఈ కె.శ్రీనివాసులు తెలిపారు. తాగునీరు రంగుమారి వచ్చేఅవకాశం ఉందన్నారు. నీటిని క్లోరినేషన్ చేసి కాపర్ సల్ఫేట్ కలిపి సరఫరా చేస్తామన్నారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని కాచి చల్లార్చి తాగాలని సూచించారు.

నీరు వచ్చే అవకాశం ఉంది : కమిషనర్

సమ్మర్ స్టోరేజి ట్యాంకులో నీరు అడుగంటిన నేపథ్యంలో నీరు విడుదల చేయమని ఇరిగేషన్ అధికారులను కోరినట్లు మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తెలిపారు. నీరు విడుదల చేసే అవకాశం ఉందని తెలిపారు. ఆ నీరు వస్తే సమస్య ఉండదన్నారు. గతంలో ఏప్రిల్ 15 వరకు నీరు ఇచ్చేవారని ప్రస్తుతం నీరు తక్కువగా ఉన్నందు వల్ల పీటీ ఛానల్‌కు రావడంలేదన్నారు.

వనరులను సమకూర్చుకోవాలి

ఎన్నికల నిర్వహణపై సమీక్షలో కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల, ఫిబ్రవరి 3: ఎన్నికల నిర్వాహణకు అవసరమైన మానవ వనరులను సమకూర్చుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వాహణపై అన్ని శాఖల జిల్లా అధికారులతో శనివారం స్పందన సమావేశ మందిరంలో కలెక్టర్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వాహణలో అధికారుల నిర్లిప్తత ఉండరాదని హెచ్చరించారు. సచివాలయాల సిబ్బందికి మూడునెలలు పాటు ఈఎల్స్ తాత్కాలికంగా నిలుపుదల చేయాలన్నారు. ప్రభుత్వ గజిటెడ్ అధికారులు, నాన్‌గజిటెడ్ అధికారులు, ఆఫీస్ సబార్డినేటర్లు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వివరాలు వేర్వేరుగా ప్రతిశాఖ జిల్లా అధికారులు స్పష్టంగా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ సి.హెచ్.శ్రీధర్, డీఆర్‌వో పి.వెంకటరమణ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధికారులు తిరుక్షవరం..
జగనన్నకు చెబుదాంలో ఓ బాధితుడు

చుండూరు: రెండేళ్ల చుండూరు గురుకుల పాఠశాలలో విద్యార్థులు క్షవరం చేశాను.. రూ.1లక్షకు పైగా అందాల్సి ఉంది.. నగదు ఇవ్వకుండా నాకు తిరుక్షవరం చేశారు.. అని రావిపాటి శివయ్య కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం చుండూరులో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పలువురు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. 1991లో చుండూరు సంఘటనలో దళితులకు ఇవ్వాల్సిన స్థలాలు ఇవ్వలేదని, కారుమూరువారిపాలెంలో ప్రభుత్వ పాఠశాలను కలప అధికార పార్టీ నాయకుడు ఎత్తుకెళ్లాడని, డొంకల్లో తాగునీటి సౌకర్యాల కోసం చేతి పంపులు ఏర్పాటు చేయాలని.. పలువురు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ముందస్తు సమాచారం లేకపోవడంతో చాలామంది తమ సమస్యలను కలెక్టర్ ముందుకు తేలేకపోయారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ శ్రీధర్, ఆర్డీవో హేలాషారోన్, ఎంపీపీ జాలాది రూబెన్, సర్పంచ్ ఉయ్యూరు అప్పిరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రతి నెలా మా సంస్థ నుంచి ఒక సినిమా

టీజీ విశ్వప్రసాద్



రవితేజ హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందిన 'ఈగల్' చిత్రం ఈ నెల 9న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాత టీజీ విశ్వప్రసాద్ సినిమా విశేషాలను మీడియాకు వెల్లడించారు.

- మేం నిర్మించిన 'ధమాకా' మాస్ ఎంటర్‌టైనర్ అయితే, 'ఈగల్' స్టయిలిష్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్. కంటెంట్ అద్భుతంగా ఉంటుంది. ఆడియన్స్‌ను అలరించే అంశాలు ఎన్నో ఉన్నాయి. రవితేజ చాలా కొత్తగా కనిపిస్తారు.
- ఈ సినిమాను జనవరిలో విడుదల చేయాలనుకున్నాం. కానీ పరిశ్రమ మేలుని దృష్టిలో పెట్టుకుని ఫిబ్రవరికి వెళ్లాం. ట్రేడ్ విషయానికి వస్తే అప్పుడు మేం సెకండ్ బెస్ట్. ఇప్పుడు నంబర్ వన్. మిగతా చిత్రాలు రీచ్ దేనికదే. ఈ ఏడాది మా సంస్థ నుంచి కనీసం 15 సినిమాలు విడుదలవుతాయి. అవి పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్నాయి. ప్రొడక్షన్‌లో దాదాపు 6 చిత్రాలు ఉన్నాయి. అలాగే దాదాపు నాలుగు సినిమాలు అమెరికాలో చేస్తున్నాం. ప్రతి నెలా మా సంస్థ నుంచి ఒక చిత్రం విడుదల కానుంది. ఈ ఏడాది 50 చిత్రాల మైలు రాయిని అందుకుంటామని భావిస్తున్నాం.

మంచి కంటెంట్‌తో...



చైతన్యా రావు, భూమి షెట్టి జంటగా నటించిన చిత్రం 'షరతులు వర్తిస్తాయి'. కుమారస్వామి దర్శకత్వంలో నాగార్జున సామల, శ్రీష్ కుమార్, డాక్టర్ కృష్ణకాంత్ చిత్రజల్లు నిర్మించిన ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైంది. ఈ సినిమా టీజర్‌ను శనివారం జరిగిన కార్యక్రమంలో దిల్ రాజు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 'ఒక మంచి కాన్సెప్ట్ తీసుకుని 'షరతులు వర్తిస్తాయి' చిత్రాన్ని నిర్మించారు. సాంగ్, టీజర్ చూశాను. బాగున్నాయి. ఇదొక మంచి సినిమా అవుతుందని ఆశిస్తున్నా' అన్నారు. దర్శకుడు కుమారస్వామి మాట్లాడుతూ 'ప్రేక్షకులకు చిన్న సినిమా, పెద్ద సినిమా అనే తేడా ఉండదు. మంచి కంటెంట్ ఉంటే తప్పకుండా చూస్తారు. మా సినిమాలో అది ఉంది. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారని నమ్ముతున్నాం' అన్నారు. 'నేను కరీంనగర్ వాసిని. పరిశ్రమలో నటుడిగా ఎదిగి మళ్లీ కరీంనగర్ వెళ్లి షూటింగ్ చేయడం ఓ అచీవ్‌మెంట్‌గా ఉంది' అన్నారు చైతన్యారావు.

ప్రేక్షకులకు ముఖ్య గమనిక



విరాన్ ముత్తంశెట్టి హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'ముఖ్య గమనిక'. సినిమాటోగ్రాఫర్ వేణు మురళీధర్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. లావణ్య కథానాయిక. ఈ చిత్రం ట్రైలర్‌ను నిర్మాత బన్నీవాసు విడుదల చేసి సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'హీరో పాత్రలో విరాన్ అద్భుతంగా నటించాడు. పాటలకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది' అన్నారు. నిర్మాతలు రాజశేఖర్, సాయికృష్ణ మాట్లాడుతూ 'వేణు అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు. కిరణ్ నేపథ్య సంగీతం ఆకట్టుకుంటుంది' అని చెప్పారు.

హనుమాన్ బాటలో ఆదిపర్వం



మంచు లక్ష్మి ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఆదిపర్వం'. సంజీవ్ మేగోటి దర్శకత్వంలో ఎంఎస్‌కే నిర్మిస్తున్నారు. 1970 నేపథ్యంలో సాగే పీరియాడిక్ డ్రామా ఇది. "అమ్మోరు, అరుంధతి' చిత్రాల తరహాలోనే ఆదిపర్వం లోనూ గ్రాఫిక్స్ హైలెట్‌గా నిలుస్తాయని, 'హనుమాన్' చిత్రం లానే 'ఆదిపర్వం' కూడా ఘన విజయం సాధిస్తుందనే నమ్మకం ఉందని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రంలో నాగులాపురం నాగమ్మ పాత్రలో మంచు లక్ష్మి నట విశ్వరూపం చూడొచ్చని నిర్మాత చెప్పారు.

ఆపరేషన్ తేదీ మళ్లీ మారింది



వరుణ్ తేజ్ నటించిన తొలి హిందీ చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్' విడుదల తేదీ మళ్లీ మారింది. వైమానిక దళ వీరుల అలుపెరుగని పోరాటాన్నీ, దేశాన్ని రక్షించడంలో వారు ఎదుర్కొంటున్న సవాళ్లను అద్భుతంగా ఆవిష్కరించే ఈ చిత్రాన్ని మొదట గత ఏడాది డిసెంబర్ 8న విడుదల చేయాలనుకున్నారు. అ తర్వాత వాయిదా వేశారు. మళ్లీ ఫిబ్రవరి 16న విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ డేట్ కూడా మారింది. మార్చి ఒకటిన ఈ చిత్రం విడుదల కానుందని తాజాగా వెల్లడించారు. తెలుగు, హిందీ భాషల్లో రూపుదిద్దుకొన్న ఈ చిత్రంలో మానుషి చిల్లర్ రాడార్ ఆఫీసర్‌గా నటించారు. శక్తి ప్రతాప్ సింగ్ హుడా దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సోనీ పిక్చర్స్, రినైసన్స్ పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

లక్కీ భాస్కర్ కథ ఏమిటి?



తెలుగులోనూ అభిమానుల్ని సంపాదించుకొన్న మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్. తన తాజా చిత్రం 'లక్కీ భాస్కర్' కోసం సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో చేతులు కలిపారు. వెంకీ అట్లూరి ఈ చిత్రానికి దర్శకుడు. దుల్కర్ తన పన్నెండేళ్ల నట జీవితాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా 'లక్కీ భాస్కర్' చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. మగధ బ్యాంకులో క్యాషియర్‌గా పని చేస్తున్న లుక్‌లో దుల్కర్ కనిపించారు. 80ల కాలం నాటి బొంబాయి నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ప్రేక్షకుల అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా అద్భుతమైన చిత్రాన్ని అందించడం కోసం దర్శకనిర్మాతలు కృషి చేస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగు, మలయాళ, తమిళ, హిందీ భాషల్లో విడుదల చేయడానికి నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ప్లాన్ చేస్తున్నారు.

హనీమూన్ ప్రేమగీతం



చైతన్యరావు, హెబ్బాపటేల్ జంటగా నటించిన చిత్రం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. తనికెళ్ల భరణి, సుహాసినీ కీలకపాత్రలు పోషించారు. బాల రాజశేఖరుని దర్శకత్వంలో కేకేఆర్, బాలరాజ్ నిర్మించారు. సంగీత దర్శకుడు కల్యాణి మాలిక్ స్వరపరచిన హృద్యమైన ప్రేమగీతాన్ని శనివారం రచయిత విజయేంద్రప్రసాద్ చేతుల మీదుగా విడుదల చేసింది. ఈ గీతాన్ని అనురాగ్ కులకర్ణి ఆలపించారు.

దిక్సూచి DIKSUCHI

ఎన్ఐఎస్ఎంలో పీజీ ప్రోగ్రామ్



ముంబైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్స్(ఎన్ఐఎస్ఎం)- 'పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ సెక్యూరిటీస్ మార్కెట్స్'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది వీకెండ్ ప్రోగ్రామ్. దీని వ్యవధి 15 నెలలు. ఈ ప్రోగ్రామ్‌లో పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్, ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజరీ, రీసెర్చ్ అనాలిసిస్ అనే మూడు స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఈ ప్రోగ్రామ్ అనువుగా ఉంటుంది.

అర్హత-ఎంపిక: ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. డిగ్రీ సర్టిఫికెట్, మార్కుల పత్రాలు దరఖాస్తుకు జతచేయాలి. ఇంగ్లీష్‌లో వెర్బల్, రిటెన్ కమ్యూనికేషన్ స్కిల్స్ ఉండాలి. వయోపరిమితి నిబంధనలు లేవు. అకడమిక్ ప్రతిభ, ఆన్‌లైన్ పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 28
- **వెబ్‌సైట్:** www.nism.ac.in

ఐఐటీ గాంధీనగర్‌లో పీహెచ్‌డీ

గాంధీనగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రాత పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

విభాగాలు: బయలాజికల్ సైన్సెస్ అండ్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ ఇంజనీరింగ్, కాగ్నిటివ్ అండ్ బ్రెయిన్ సైన్సెస్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్-ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఎర్త్ సైన్సెస్-ఎర్త్ సిస్టమ్స్ సైన్స్ అండ్ ఆర్కియలాజికల్ సైన్సెస్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్-సొసైటీ అండ్ కల్చర్, మెటీరియల్స్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి సంబంధిత విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో ఎంఏ/ఎమ్మెస్సీ/బీటెక్/ఎంటెక్/బీఎస్(ఐసర్/ఐఐఎస్సీ)/బీఎస్-ఎంఎస్(ఐసర్)ఉత్తీర్ణులై ఉండాలి. నెట్/గేట్ అర్హత ఉన్నవారికి; సీఎఫ్‌టీఐ సంస్థల నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులకు; ఐఐటీలు, ఐసర్లు, ఐఐఎస్సీ నుంచి 8 సీజీపీఏతో పీజీ/ఎంఎస్ పూర్తిచేసినవారికి సంస్థ ఫెలోషిప్ ఇస్తుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.300; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.150
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 20
- **వెబ్‌సైట్:** iitgn.ac.in

అప్లయిడ్ స్టాటిస్టిక్స్‌లో పీజీ డిప్లొమా

కోల్‌కతాలోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్(ఐఎస్ఐ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ అప్లయిడ్ స్టాటిస్టిక్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఏడాది వ్యవధి గల ఆన్‌లైన్ ప్రోగ్రామ్. ఇందులో రెండు సెమిస్టర్లు ఉంటాయి. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. హైస్కూల్ స్థాయి మేథమెటిక్స్‌లో ప్రావీణ్యం ఉండాలి. అకడమిక్ మెరిట్, అసెస్‌మెంట్ టెస్ట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు

- మొదటి సెమిస్టర్‌లో బేసిక్ స్టాటిస్టిక్స్, బేసిక్ ప్రాబబిలిటీ, స్టాటిస్టికల్ మెథడ్స్, సర్వే శాంపిలింగ్, ఇంట్రడక్షన్ టు అఫీషియల్ స్టాటిస్టికల్ సిస్టమ్, స్టాటిస్టిక్స్ అండ్ ఎకానమీ కోర్సులు ఉంటాయి.
- రెండో సెమిస్టర్‌లో అఫీషియల్ స్టాటిస్టిక్స్, డేటా సైన్స్ స్పెషలైజేషన్‌లు ఎంచుకోవాలి.
- ప్రోగ్రామ్‌లో భాగంగా లెక్చర్లు, క్విజ్‌లు, అసైన్‌మెంట్లు, ఇంటరాక్షన్ సెషన్స్, కెరీర్ వర్క్‌షాప్‌లు, మెంటార్‌షిప్ సెషన్స్ ఉంటాయి.
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఫిబ్రవరి 18
- **అసెస్‌మెంట్ టెస్ట్ తేదీ:** ఫిబ్రవరి 25
- **వెబ్‌సైట్:** www.isical.ac.in

నిమ్‌హాన్స్‌లో సర్టిఫికెట్ కోర్సు



బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్(నిమ్‌హాన్స్)- 'బేసిక్స్ ఆఫ్ యోగ థెరపీ ఫర్ మెంటల్ హెల్త్ ప్రొఫెషనల్స్' కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది సర్టిఫికెట్ కోర్సు. ఇందులో 100 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. కోర్సు వ్యవధి ఒక నెల. రోజుకి రెండు గంటలు చొప్పున వారానికి అయిదు రోజులు ఆన్‌లైన్ ట్రెయినింగ్ ఉంటుంది. సోమవారం నుంచి శుక్రవారం వరకు ప్రతిరోజూ సాయంత్రం నాలుగుంబావు నుంచి ఆరుంబావు వరకు ట్రెయినింగ్ సెషన్స్ నిర్వహిస్తారు. కోర్సు చివరలో ఒక రోజు ఆఫ్‌లైన్ వర్క్‌షాప్ నిర్వహిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఎంబీబీఎస్/బీఏఎంఎస్/బీహెచ్ఎంఎస్/బీఎన్‌వైఎస్/బీయూఎంఎస్/బీఎస్ఎంఎస్ ఉత్తీర్ణతతోపాటు మెంటల్ హెల్త్ క్లినికల్ సర్వీసెస్ విభాగాల్లో పని చేస్తున్నవారు అప్లయ్ చేసుకోవచ్చు. (పీహెచ్‌డీ/ఎమ్మెస్సీ/ఎంఫిల్)(సైకియాట్రీ/క్లినికల్ సైకాలజీ/సైకియాట్రిక్ సోషల్ వర్క్/సోషల్ వర్క్/సైకియాట్రిక్ నర్సింగ్) ఉత్తీర్ణులు; కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు సహా ఆర్మ్‌డ్ ఫోర్సెస్, ఎన్‌జీఓ సంస్థలు స్పాన్సర్ చేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 24
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** మార్చి 1 నుంచి
- **ఈ-మెయిల్:** yogaforstress.nimhans@gmail.com
- **వెబ్‌సైట్:** nimhans.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/GUALukCలో చదవండి.

అమరావతిని విస్మరించడం తగదు

● 1509వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు



వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేసున్న మహిళలు

తుళ్లూరు ఫిబ్రవరి 3: విశాఖను రాజధాని చేసే సంగతి తరువాత.. ముందు రైల్వేజోన్ ఏర్పాటు చూడాలని అమరావతి రాజధానికి 33వేల ఎకరాలు త్యాగంచేసిన రైతులు పేర్కొన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేస్తుంటే సీఎం జగన్‌రెడ్డికి చలనం లేదన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడపించాల్సి ఉండగా అథోగతిపాలుజేశాడన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతుకూలీలు చేస్తున్న ఆందోళనలు శనివారం నాటికి 1509వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ రాష్ట్రానికి సంపదనిచ్చే అమరావతిని నిర్వీర్యం చేయటం పెద్ద తప్పిదమన్నారు. మూడు పంటలుపండే భూమిని రాజధాని కోసం ఇస్తే అడవిని చేశాడన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో దాదాపు 9వేల కోట్ల అమరావతి నిర్మాణ పనులు జరిగాయన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పును గౌరవించి రాజధాని అమరావతి అభివృద్ధిని కొనసాగించాలన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. తుళ్లూరు, వెలగపూడి, మందడం, వెంకటపాలెం, నెక్కల్లు, అనంతవరం, ఉద్దండ్రాయునిపాలెం తదితర రాజధాని గ్రామాల్లో మూడు రాజధానులకు వ్యతిరేకంగా ఆందోళనలు, నిరసన దీక్షలు కొనసాగాయి.

మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ

● మాజీ ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, ఫిబ్రవరి 3: పాద యాత్ర సమయంలో అధికారం కోసం జగన్ నిరుద్యోగులకు ఆశలు కల్పించి అధికారంలోకి వచ్చాక నిరాశే మిగిల్చాడని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాదయాత్ర సమయంలో తాము అధికారంలోకి రాగానే 23 వేల ఖాళీలతో మెగా డీఎస్సీ వేస్తామని చెప్పిన జగన్ ఇప్పుడు ఐదేళ్లకు మాటమార్చి ఆరువేల పోస్టులతో డీఎస్సీ అంటూ హడావుడి చేయడం దగా అని అన్నారు. జనవరి 1వ తేదీన జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి ఐదేళ్లలో ఎవరికి ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో 50,892 ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలను గుర్తించగా జగన్‌మాత్రం 6 వేల మందితోనే డీఎస్సీ అంటూ చేతులు దులుపుకొంటున్నారన్నారు. నిరుద్యోగుల ఆశలపై జగన్, మంత్రి బొత్స సత్యనారాయణ నీళ్లు చల్లారన్నారు. దేశవ్యాప్తంగా 11 శాతం నిరుద్యోగం ఉంటే జగన్ నిర్వాకం వల్ల రాష్ట్రంలో నిరుద్యోగ శాతం 24కు పెరిగిందన్నారు. రాష్ట్రాన్ని నిరుద్యోగాంధ్రప్రదేశ్‌గా, మద్యాంధ్రప్రదేశ్, గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత జగన్‌దేనన్నారు. ఉద్యోగాలు లేక 1,745 మంది యువత బలవన్మరణానికి పాల్పడ్డారన్నారు. ముఖ్యమంత్రి విద్యార్థులకు జగన్ మామ కాదు.. సైకో మామ అని, జనాలను తరలించేందుకు బస్సులు కావాలనే ఉద్దేశంతో పరీక్షలను కూడా వాయిదా వేశారంటే వైసీపీ నేతల పిచ్చి పరాకాష్టకు చేరిందన్నారు.

వైసీపీ నేతల కనుసన్నల్లో గంజాయి స్మగ్లింగ్

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ



నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 3: వైసీపీ నేతల కనుసన్నలలో గంజాయి స్మగ్లింగ్ విచ్చలవిడిగా జరుగుతోందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు శనివారం ఓ ప్రకటనలో ఆరోపించారు. ఇప్పటివరకు అధికార పార్టీ నాయకులు చేసే గంజాయి స్మగ్లింగ్‌లో కొందరు పోలీసులు కూడా భాగస్వామ్యం ఉండడం దారుణం అన్నారు. గంజాయి మాఫియాకి ఏపీ సర్కార్ పెద్దల అండదండలు ఉన్నాయని తెలిసిన పోలీసులు స్మగ్లర్లకు అనుకూలంగా మారడం దుర్మార్గమన్నారు. 22 కిలోల గంజాయితో కాకినాడ ఏపీ ఎస్పీ మూడవ బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ హైదరాబాద్ పోలీసులకు పట్టుపడటం పోలీసుల స్మగ్లింగ్ పాల్పడుతున్నారనటానికి నిదర్శనం అన్నారు. రాష్ట్రంలో గంజాయి స్మగ్లింగ్ డబ్బు మొత్తం తాడేపల్లి ప్యాలెస్‌కే తరలిపోతుందని ఆరోపించారు. టీడీపీ పాలనలో రాష్ట్రం పెట్టుబడులలో ప్రథమ స్థానంలో నిలిస్తే నేడు జగన్‌రెడ్డి పాలనలో గంజాయి స్మగ్లింగ్‌ల రాష్ట్రం ముందు వరుసల నిలవడం సిగ్గుచేటన్నారు. సంక్షేమం పేరుతో జగన్‌రెడ్డి ఒక చేత్తో రూపాయి ఇస్తూ మరో చేత్తో వంద రూపాయలు దోచుకుంటున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలి..

● లేదంటే జగన్మోహనరెడ్డికి గుణపాఠం తప్పదు

● పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ తదితరులు

నరసరావుపేట టౌన్, ఫిబ్ర వరి 3: ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 2023ను రద్దు చేయక పోతే జగన్మోహనరెడ్డి ప్రభు త్వానికి వచ్చే ఎన్నికల్లో గుణ పాఠం తప్పదని పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలు కా చంద్రశేఖర్ అన్నారు. శని వారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని కోటప్ప కొండ రోడ్డులో ఉన్న సీపీఎం కార్యాలయంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 2023ను రద్దు చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశం పీడీఎం ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ జగన్మోహనరెడ్డి రైతులను, ఆస్తులు గలవారి హక్కులను హరించి పెద్దపెద్ద కార్పొరేట్ శక్తులకు భూములను అప్పగించే దాంట్లో భాగమే ఈ చట్టం అన్నారు. ఈ చట్టాన్ని రద్దు చేయకపోతే రైతులు ఈప్రభుత్వానికి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం ప్రజా వ్యతిరేక భూమి హక్కు చట్టం ఏపీ ల్యాండ్ టైటిలింగు యాక్ట్ 2023 రద్దు చేయాలని తీర్మానించింది. కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు, జి.రామకృష్ణ, కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ, ఎంసీపీయు జిల్లా కార్యదర్శి రెడ్ బాష, రైతు సంఘం నాయకులు గోపాలరావు, కామినేని రామారావు, భారత బచావో జిల్లా అధ్యక్షుడు వి.కోటనాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రయోగ పరీక్షల్లో నూతన మార్పులు

● ఆర్ఐవో జీకే జుబేర్



వర్కుషాపులో మాట్లాడుతున్న ఇంటర్ బోర్డు ఆర్ఐవో జుబేర్

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 3: ఈ ఏడాది జరిగే ఇంటర్ ప్రయోగపరీక్షల్లో బోర్డు ప్రవేశపెట్టిన నూతన మార్పులపై ఇన్విజిలేటర్లకు అవగాహన ఉండాలని ఆర్ఐవో జీకే జుబేర్ పేర్కొన్నారు. శనివారం ఏసీ కళాశాల ఆడిటోరియంలో ఇంటర్ ప్రయోగ పరీక్షలపై సైన్స్ అధ్యాపకులకు నిర్వహించిన వర్కుషాపులో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది ప్రయోగపరీక్షల్లో విద్యార్థులకు వచ్చిన మార్కులు ఆన్‌లైన్‌లోనే నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఈనెల 5వ తేదీ నుంచి 20వరకు వృత్తివిద్యాకోర్సుల విద్యార్థులకు, 11నుంచి 20వ తేదీ వరకు జనరల్ విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈసీ సభ్యులు జి.బాలమోహన్, బి.రవికుమార్, ఎల్.కోదండరామ్, ఎస్.రమేష్, సీహెచ్ ప్రకాశరావు పాల్గొన్నారు.

10లోగా పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం..

ఇంటర్ పరీక్ష ఇంత వరకు చెల్లించని వారు ఈనెల 10లోగా చెల్లించే అవకాశం ఇంటర్ బోర్డు కల్పించినట్లు ఆర్ఐవో తెలిపారు. విద్యార్థులు తాము చదివిన కళాశాలలో సంప్రదించి ఫీజులు చెల్లించాలని సూచించారు.

అధికారుల తీరుతోనే పూజిత ఆత్మహత్య

● న్యాయం జరగాలంటూ రోడ్డెక్కిన ఉద్యోగులు



వేమూరులో పూజిత మృతికి నిరసనగా ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగులు

వేమూరు, ఫిబ్రవరి 3: బాపట్ల జిల్లా వేమూరు మండలం చావలి గ్రామంలో ఆర్‌బీకేలో వీఏఏగా పనిచేస్తున్న బెల్లంకొండ పూజిత కేవలం ఉన్న తాధికారుల ఒత్తిళ్ళ వల్లనే ఆత్మహత్య చేసుకుందని సచివాలయ ఉద్యోగులు ఆరోపించారు. పూజితకు న్యాయం జరగాలంటూ సచివాలయాల ఉద్యోగులు, ఆర్‌బీకేల ఉద్యోగులు, ఏఈఓలు శనివారం సాయంత్రం వేమూరు లో నిరసనగా శాంతియుత ర్యాలీ నిర్వహించారు. కొవ్వొత్తులు, నల్లబ్యాడ్జీలు ధరించి ఉన్నతాధికారుల తీరు మార్చుకోవాలని, అధికార పార్టీ నాయకుల జులుం నశించాలంటూ నినాదాలు చేశారు. మండల వ్యవసాయశాఖ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎరువుల అమ్మకం విషయంలో అధికార పార్టీ నాయకులు బెదిరింపులు, తీసుకున్న ఎరువులకు డబ్బులు చెల్లించకపోవడం వల్ల పూజిత మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిందని పే ర్కొన్నారు. తమ విధుల్లో నాయకుల ప్రమేయం లే కుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పూజితకు న్యాయం జరగాలని ఆమె మృతికి కారకులైన అధికార పార్టీ రైతులు, అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా వ్యవసాయ విస్తరణాధికారుల అధికారుల సంఘం నాయకులు సీహెచ్ సుధారతన్, ఎం.సురేష్, గోపియాదవ్, కె.శ్రీనివాస్, ఏ.మహేష్, సచివాలయ ఉద్యోగులు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జి.హరికృష్ణ, ఇతర సంఘాల నాయకులు, మండల పరిధిలోని ఉద్యోగులే కాకుండా ఇతర మండలాల పరిధిలోని ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జార్ఖండ్‌పై భారీ ఆధిక్యంతో ఉత్తరాఖండ్ గెలుపు



నందిని కశ్యప్ (96 పరుగులు) | రాఘ్వి బిస్ట్ (98 పరుగులు) | నీలం భరద్వాజ్ (5 వికెట్లు)

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 3: బీసీసీఐ అండర్-23 మహిళల వన్డే టోర్నీలో భాగంగా మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో శనివారం జరిగిన మ్యాచ్‌లో జార్ఖండ్ జట్టుపై ఉత్తరాఖండ్ 109 పరుగులు తేడాతో ఘనవిజయం సాధించింది. తొలుత టాస్ గెలిచిన జార్ఖండ్ ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన ఉత్తరాఖండ్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 267 పరుగులు చేసింది. ఈ జట్టులో రాఘ్వి బిస్ట్ 98 పరుగులు, నందిని కశ్యప్ 96 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జార్ఖండ్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 158 పరుగులు మాత్రమే చేయగలిగింది. జార్ఖండ్ బ్యాటర్లు జయ 41, ఖుష్బు కుమారి 31 పరుగులు చేయగా, ఉత్తరాఖండ్ బౌలర్ నీలం భరద్వాజ్ 7 ఓవర్లలో 29 పరుగులిచ్చి 5 వికెట్లు సాధించింది. టోర్నీలో భాగంగా తదుపరి మ్యాచ్ ఈ నెల 5వ తేదీన ఉత్తరప్రదేశ్, విదర్భ జట్ల మధ్య మంగళగిరిలో జరుగనుంది.

యువత ప్రయత్నిస్తే సుసాధ్యమే..

● సినీ నటుడు కిరణ్ అబ్బవరం, భారత మాజీ క్రికెటర్ ఎమ్మెస్కే ప్రసాద్

● విజ్ఞాన్‌లో వైభవంగా ముగిసిన మహోత్సవ్



ప్రసంగిస్తున్న ఎంఎస్‌కే ప్రసాద్, వేదికపై సినీ నటుడు కిరణ్ అబ్బవరం

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 3: యువత అంకితభావంతో కృషిచేస్తే సాధ్యం కానిది ఏదీ లేదని వక్తలు ఉద్ఘాటించారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలో విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో రెండురోజులుగా జరుగుతున్న విజ్ఞాన్‌మహోత్సవ్ శనివారం అట్టహాసంగా ముగిసింది. ముఖ్య అతిథులగా హాజరైన సినీ హీరో కిరణ్ అబ్బవరం, భారత మాజీ క్రికెటర్ ఎమ్మెస్కే ప్రసాద్ తదితరులు మాట్లాడారు. తొలుత కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ ఎప్పుడూ సానుకూల దృక్పథంతో ఆలోచించాలన్నారు. ఎమ్మెస్కే ప్రసాద్ మాట్లాడుతూ యువతకు జీవితంలో నిర్దిష్టమైన లక్ష్యం ఉండాలని, దాని సాధించేంతవరకు అవిశ్రాంతంగా కష్టపడాలని సూచించారు. సినీ కథారచయిత బుర్రా సాయిమాధవ్ ప్రసంగిస్తూ ప్రతి మనిషిలోనూ రైటర్, డైరక్టర్, యాక్టర్, డాక్టర్, పొలిటీషియన్, ఇంజినీర్ ఉంటారని... కాకపోతే మీలో ఎవరున్నారన్నది మీకే తెలియాలన్నారు..

విజ్ఞాన్ మహోత్సవ్ 2కే23 విజేతలు

జాతీయస్థాయి విజ్ఞాన్ మహోత్సవ్‌లో భాగంగా మొత్తం 75 ఈవెంట్లను నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమెంటోలు, రూ.15లక్షల విలువైన నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోడి కత్తి శ్రీను కేసులో న్యాయం చేయాలి

గుంటూరు, ఫిబ్రవరి 3: కోడి కత్తి శ్రీను కేసులో బాధిత కుటుంబానికి న్యాయంచేయాలని దళిత, మైనార్టీ హక్కుల పరిరక్షణసమితి నాయకులు విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్‌నజీర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్‌కుమార్, ముస్లిం మైనార్టీ హక్కుల పరిరక్షణసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఫరూక్‌షిబ్లీ, అడ్వకేట్ పాలేటి ఉమామహేశ్వరరావు, జనసేన నాయకుడు పోతిన మహేష్ పలువురు నాయకులు గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ గొడ్డలితో మాజీమంత్రి వివేకాను హత్య చేసినవారికి బెయిల్ వచ్చింది, దళిత డ్రైవర్ సుబ్రమణ్యంను హత్యచేసి డోర్ డెలివరీ చేసిన అనంత్‌బాబుకు బెయిల్ వచ్చింది.. కానీ చిన్నగాయం కేసులో జనపల్లి శ్రీనివాసరావుకు మాత్రం బెయిల్ రావటం లేదని అన్నారు. కోర్టుకు వచ్చి జగన్ ఎందుకు సాక్ష్యం చెప్పటంలేదని ప్రశ్నించారు. కోడి కత్తి శ్రీను కేసులో బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సమత సైనిక్ దళ్ రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర, ఆర్పీఐ నాయకుడు డాక్టర్ సుభాని, బాలకోటయ్య తదితరులున్నారు.



గవర్నర్ నజీర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పలు సంఘాల నాయకులు

ఎమ్మెల్యేలను కాదు.. సీఎంను మార్చాలి

● కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 3: ఎమ్మెల్యేలను మార్చటం కాదని, ముఖ్యమంత్రిని మార్చాలని ప్రజలు నిర్ణయించారని సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అక్రమ సంపాదన కోసం జగన్‌మోహనరెడ్డి ఎంత నీచానికైనా తెగబడతాడని అతని పనులే చెపుతున్నాయన్నారు. జగన్ జైల్లో ఉండి బ్రిటీష పాలన పట్ల అవగాహన పెంచుకొని అదే విధానాన్ని రాష్ట్రంలో అవలంబిస్తున్నాడన్నారు. తల్లికి, చెల్లికి న్యాయంచేయని జగన్ రాష్ట్రానికి ఏం న్యాయం చేస్తాడని ఆయన ప్రశ్నించారు. జగన్‌తో పాటు ఆయన అనుచరులు రాష్ట్రాన్ని దోచుకోవటం కోసం పోటీ పడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి తన స్వార్ధం కోసం రాష్ట్రాన్ని దోచుకుంటుంటే రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ నాయకులు అదే బాటలో దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. జగన్ ముఠాను ప్రజలు తిరస్కరించే సమయం ఆసన్నమైందన్నారు.

ఆదాయ పన్ను శాఖ అధికారుల తనిఖీలు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 3: సత్తెనపల్లి మండలం అబ్బూరులో, సత్తెనపల్లి పట్టణంలో శనివారం ఆదాయ పన్ను శాఖ అధికారులు ఓ వ్యక్తికి సంబందించిన గృహంలో, వారి బంధువుల గృహాల్లో తనిఖీలు చేశారు. గుంటూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో పీఆర్‌వోగా పనిచేస్తున్న గద్దె తులసీరామ్ ఆచూకీ కోసం వారు విచారణ చేశారు. వడ్డవల్లిలోని ఆయన గృహానికి వెళ్ళి వివరాలు సేకరించారు. ఆయన అందుబాటులో లేకపోవటంతో సోదరుడు రాఘవను అదుపులోకి తీసుకున్నారు. ఆయనను మండలంలోని అబ్బూరు గ్రామంలో ఉన్న తులసీరామ్ బంధువు ఇంటికి తీసుకు వెళ్ళారు. అక్కడ తులసీరామ్‌కు సంబందించిన రెండు సెల్‌ఫోన్లు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. స్థానిక పట్టణ పోలీసుస్టేషన్‌లో కూడా తులసీరామ్‌కు సంబందించిన వివరాలను ఆదాయ పన్నుశాఖ అధికారులు సేకరించారు.

టీడీపీ కార్యకర్తకు చెందిన ఆటో దహనం

దాచేపల్లి, ఫిబ్రవరి3: టీడీపీ కార్యకర్త కు చెందిన ఆటో ఇంటిముందు నిలిపి వుంచగా తెల్లవారుజామున చూసేసరికి ఆటో దహనం కావడాన్ని గుర్తించారు. కేశానుపల్లి గ్రామానికి చెందిన షేక్ రఫీ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నా డు. రోజువారి విధుల్లో భాగంగా ఆటోను రాత్రి 8 గంటల సమయంలో ఇంటి ముందు నిలిపాడు. తెల్లవారుజామున లేచి చూసేసరికి ఆటో పూర్తిగా మంట ల్లో కాలిపోయి వుండటాన్ని గుర్తించాడు. రఫీ టీడీపీ కార్యకర్తగా పనిచేస్తున్నాడు. ఈ ఘటన వ్యక్తిగత కారణమా, రాజకీయమా కోణంలో జరిగిందనేది నిర్ధారణ కాలేదు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదని బాధితుడు రఫీ పేర్కొన్నారు.

బెట్టింగ్‌లకు యువకుడు బలి

● అడవిలో ఉరివేసుకున్న డిగ్రీ విద్యార్థి



రామావత్తు బాలస్వామి నాయక్ (ఫైల్)

ఈపూరు, ఫిబ్రవరి 3: మండలంలోని యర్రగుంటతండాకు చెందిన రామావత్తు బాలస్వామి నాయక్(20) అడవిలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బాలస్వామి వినుకొండలోని ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. గతనెల 26వ తేదీన పొలంవెళ్ళిన బాలస్వామినాయక్ ఇంటికి వెళ్తున్నట్లు తండ్రి శ్రీరాములు నాయక్‌తో చెప్పి కన్పించకుండా పోయాడు. సాయంత్రం ఇంటికి రాకపోయేసరికి బంధువుల ఇళ్ళ వద్ద, కళాశాలలో, స్నేహితులను ఆరా తీయగా రాలేదని చెప్పారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అడవిలో వెతుకుతుండగా బాలస్వామి మృతదేహం చెట్టుకు వేలాడుతూ కనిపించింది. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం కోసం వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలస్వామి ఆన్‌లైన్ బెట్టింగ్‌లు ఆడడం వలన అప్పులపాలైనట్లు బంధువులు తెలిపారు. బాలస్వామి కన్పించకుండాపోయిన తరువాత రెండు రోజులకు అప్పు చెల్లించాలని ఇంటికి కొందరు యువకులు వచ్చినట్లు తండ్రి తెలిపారు. మృతుని తల్లిదండ్రుల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహమ్మద్ ఫిరోజ్ తెలిపారు.

వారం పాటు పలు ఎక్స్‌ప్రెస్‌ల రద్దు

● గోల్కొండ ఎక్స్‌ప్రెస్ కాజీపేట వరకే ప్రయాణం

గుంటూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్-మౌలాలి బైపాస్ లైన్ నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా పలు రైళ్లను వారంపాటు రద్దు చేస్తు న్నట్లు దక్షిణమధ్య రైల్వే ప్రకటించింది. నెంబరు. గుంటూరు - సికింద్రాబాద్ - గుంటూరు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ వయా వరంగల్‌ని, గుంటూరు-వికార బాద్-గుంటూరు పల్నాడు ఎక్స్‌ప్రెస్‌ని కూడా 5వ తేదీ నుంచి 11వ తేదీ వరకు రద్దుచేసింది. నడికుడి - మిర్యాలగూడ రైలుని ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు, కాచీగూడ-మిర్యాలగూడ-నడికుడి రైలుని ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు, మిర్యాలగూడ - కాచీగూడ రైలుని ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు రద్దు చేసింది. కాచీగూడ- రేపల్లె రైలుని ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు, రేపల్లె - సికింద్రాబాద్ రైలుని ఈ నెల 5 నుంచి 11వ తేదీ వరకు రద్దు చేశామని పేర్కొన్నది. సికింద్రాబాద్ - రేపల్లె రైలుని ఈ నెల 5 నుంచి 11వ తేదీ వరకు, రేపల్లె - సికింద్రాబాద్ రైలుని ఈ నెల 4 నుంచి 10వ తేదీ మధ్యన రద్దు చేసింది. గుంటూరు - సికింద్రాబాద్ - గుంటూరు గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 5నుంచి 11వ తేదీ మధ్యన కాజీపేట వరకే నడిపి వెనక్కు మళ్లించడం జరుగుతుందని తెలిపింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.33 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	214.00
చికెన్ స్కిన్ లెస్	224.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



టీడీపీలో చేరిన వారితో నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ.

టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు

బాపట్ల, ఫిబ్రవరి 3 : మండలంలోని ఆసోదివారిపాలెం పంచాయతీ పోతురాజుకొత్తపాలెం గ్రామం నుంచి 32 మంది వైసీపీ కార్యకర్తలు శనివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ వారికి కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. నరేంద్రవర్మ చేస్తున్న సేవా కార్యక్రమాలు, తెలుగుదేశంపార్టీ విధానాలు నచ్చి పార్టీలో చేరుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ముక్కామల సాంబశివరావు, మాజీ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, పార్టీశ్రేణులు పాల్గొన్నారు.

పేద-సంపన్నుల మధ్య పెరిగిన అంతరం

● కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం

బాపట్ల, ఫిబ్రవరి 3 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో పేద ప్రజలు-సంపన్నుల మధ్య అంతరం పెరిగిపోయిందని, 70 శాతం ఆదాయం ధనికుల చేతుల్లోకి వెళ్ళిపోయిందని కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి పర్యటనను పురస్కరించుకొని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గంటా అంజిబాబు అధ్యక్షతన బాపట్ల కాపు కళ్యాణ మండపంలో శనివారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి జెడి.శీలం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రత్యేకహోదా, పోలవరం నిర్మాణం, విశాఖ స్టీల్‌ప్లాంట్ వంటి సమస్యలపై కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు పట్టించుకోకపోవటం దారుణమన్నారు. వైసీపీ దళితుల పార్టీ అని చెబుతూనే దళితులకు సంబంధించిన 27స్కీమ్‌లు రద్దు చేశారన్నారు. క్రిస్టియన్, ముస్లిం, దళితులపై దాడులు పెరిగిపోయాయన్నారు. వీటిని అడ్డుకోవటానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో షర్మిల రాష్ట్ర పర్యటన చేస్తుందన్నారు. పార్లమెంట్ పరిశీలకులు శ్రీపతి ప్రకాష్ మాట్లాడుతూ బాపట్ల పర్యటనకు వస్తున్న షర్మిలకు ఘనస్వాగతం పలకాలన్నారు. జిల్లాకాంగ్రెస్ అధ్యక్షులు గంటా అంజిబాబు మాట్లాడుతూ 7న బాపట్ల చీలురోడ్డు సెంటర్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు రోడ్‌షో, ఆతర్వాత అక్కడ ఏర్పాటు చేసే బహిరంగసభలో షర్మిల ప్రసంగిస్తారన్నారు. సమావేశంలో వేమూరు నియోజకవర్గ నాయకులు తాడికొండ వెంకటేశ్వరరావు, బురుగా సుబ్బారావు, అద్దంకి నియోజకవర్గ నాయకులు కె.సురేంద్ర, కళ్యాణిచక్రవర్తి, పర్చూరు నియోజకవర్గ నాయకులు తోట శివ నాగేశ్వరరావు, చీరాల నాయకులు దేవరపల్లి రంగారావు, జిల్లాపార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు పఠాన్ రాజేష్, జిల్లా మహిళా అధ్యక్షురాలు ప్రవల్లిక, సంతనూతలపాడు నాయకులు తుమ్మల సుబ్బారావు, ఆదినారాయణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు దోనేపూడి దేవరాజు, మహిళా అధ్యక్షురాలు దండు రేణుక, జిల్లా నాయకులు శీలం సాగర్, సీనియర్ నాయకులు ఎస్‌వీఆర్ కుమార్, చింతా బాబురావు, దోనేపూడి రవి, దేవరపల్లి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం

మత్స్యకారులకు సబ్సిడీపై లైఫ్‌జాకెట్‌లు పంపిణీ

బాపట్ల, ఫిబ్రవరి 3 : మండలంలోని ముత్తాయపాలెం గ్రామపంచాయతీ పల్లెపాలెం గ్రామానికి చెందిన బోటు యజమానులకు 70 శాతం సబ్సిడీపై లైఫ్ జాకెట్‌లు అందజేశారు. స్థానిక ఆదర్శనగర్ మత్స్యశాఖ అభివృద్ధి అధికారి కార్యాలయంలో రాష్ట్రీయ కృషి వికాస్‌యోజన పథకం కింద వీటిని రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ కన్నా మామిడయ్య పంపిణీ చేశారు. దరఖాస్తు చేసుకున్న వారికి వీటిని అందజేస్తున్నామని, చేపల వేటకు వెళ్ళే ప్రతిబోట్‌లో సి-సేఫ్టీ పరికరాలు తప్పనిసరిగా ఉంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మత్స్యశాఖ సిబ్బంది వై.ఎమ్ శివశ్రీ, సాగరమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

తాగు, సాగునీరు అందించటంలో ప్రభుత్వం విఫలం

● టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి చింతారావు

రేపల్లె, ఫిబ్రవరి 3 : తీరప్రాంతంలో తాగు, సాగునీరు అందించటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని రేపల్లె నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి పీవీ చింతారావు అన్నారు. శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ తీరప్రాంతంలోని వెల్లటూరు ఛానల్, నిజాంపట్నం ఛానల్, కూచినపూడి, తుమ్మల పరిధిలో ఉన్న పంట భూములకు సాగునీరు లేక రెండో పంటైన మినుము, మొక్కజొన్న, పెసర, ఎండిపోతున్నాయని జలవనరుల శాఖాధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న పట్టించుకున్న దాఖలాలు లేవంటూ ఆయన విమర్శించారు. రేపల్లె సబ్ డివిజన్ పరిధిలో లక్ష ఎకరాలకు పైగా సాగుభూమి ఉండగా రెండవ పైరు రెండవ దశలో ఉందని, సాగునీరు లేక పొలాలు బీడులు మారి మొక్కలన్నీ ఎండిపోతున్నాయన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అటు వ్యవసాయశాఖ, జలవనరుల శాఖ, రెవెన్యూ అధికారులకు తెలిపినా కనీసం స్పందించలేదన్నారు. ఇప్పటికే గ్రామాల్లో చెరువులన్నీ ఎండిపోయాయని, తాగునీరు లేక గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పంతాని మురళీధరరావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కొలసాని రాము, టీడీపీ నాయకులు రేపల్లె సురేష్, నల్లపాటి యల్లయ్య వడ్డి లక్ష్మీజీ, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ అధికార ప్రతినిధి చింతారావు



అధికారులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు

ప్రత్యామ్నాయ పంటలపై రైతులు అవగాహన పెంచుకోవాలి

● వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాసరావు

బాపట్ల,ఫిబ్రవరి 3 : ప్రత్యామ్నాయ పంటలపై రైతులు అవగాహన పెంచుకోవాలని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. కళాశాల బీఎస్సీ చివరి సంవత్సరం విద్యార్థులకు అనుభవపూర్వక అభ్యాస కార్యక్రమం శిక్షణలో భాగంగా సాగు చేసిన అజోల్లా, పుట్టగొడుగుల పెంపకం విధానంపై రైతులు అవగాహన పెంచుకొని తాము కూడా వ్యవసాయానికి అనుబంధంగా వాటిని సాగు చేసి అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. అదేవిధంగా చిరుధాన్యాలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన రైతు శిక్షణా కార్యక్రమంలో పాల్గొని పశువులకు మేతగా, పంటకు జీవన ఎరువుగా అజోల్లా ఉపయోగపడుతుందన్నారు. షుగర్‌వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, పోషకలోపంతో బాధపడే పిల్లలకు పుట్టగొడుగులు ప్రత్యామ్నాయ పోషకాహారంగా దోహదపడుతాయన్నారు. మైక్రోబయాలజీ విభాగం నిర్వాహణలో జరుగుతున్న అజోల్లా, పుట్టగొడుగుల సాగుపై విద్యార్థులు తయారు చేసిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎ.విజయ్‌గోపాల్, డాక్టర్ ఎం.రమాదేవి, డాక్టర్ బిహెచ్ శార్వాణి, చెంగ్రాయుడు పాల్గొన్నారు.

కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలి

● ఆరవ అదనపు జిల్లా కోర్టు జడ్జి బాలాజి

బాపట్ల,ఫిబ్రవరి 3 : జాతీయ లోక్ అదాలత్‌ని పురస్కరించుకొని మార్చి 9వ తేదీన జిల్లా కోర్టులో జరిగే లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, ఆరవ అదనపు జిల్లా కోర్టు జడ్జి కేపీ బాలాజి తెలిపారు. బాపట్ల కోర్టు ఆవరణలో శనివారం ఈ విషయమై పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బంది కేసుల పరిష్కారం విషయంలో ప్రత్యేకశ్రద్ధ చూపించాలన్నారు. తద్వారా ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.పవన్‌కుమార్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.రుక్మిణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గడ్డం రేణుకా లత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భీమా లీలాకృష్ణ, డీఎస్పీ టి.వెంకటేశులు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



పోలీసు అధికారులతో సమావేశమైన జడ్జి బాలాజి, తదితర జడ్జిలు

బాపట్ల ఎంపీ సీటు మాల అభ్యర్థికే ఇవ్వాలి

● మాలమహాసభ వ్యవస్థాపకులు మల్లెల వెంకట్రావు

బాపట్ల, ఫిబ్రవరి 3 : బాపట్ల పార్లమెంట్ సీటు మాల అభ్యర్థులకే కేటాయించాలని మాలమహాసభ వ్యవస్థాపకుడు మల్లెల వెంకట్రావు డిమాండ్ చేశారు. బాపట్లలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో బాపట్ల పార్లమెంట్ సీటు అన్ని రాజకీయపార్టీలు మాల అభ్యర్థులకే కేటాయించాలన్నారు. గత ఎన్నికలలో మాదిగ అభ్యర్థిని ఎంపీగా గెలిపించినా ఏ రోజు ఎస్సీల సమస్యలపై ఆయన మాట్లాడింది లేదన్నారు. ఎంతో అభిమానంతో జగన్మోహనరెడ్డిని గెలిపిస్తే అన్నంపెట్టిన చేతికి సున్నం పూసినట్లు చేశారన్నారు. రద్దు చేసిన పథకాలను వెంటనే ప్రారంభించాలని బాపట్ల ఎంపీ సీటును అన్నిపార్టీలు మాలలకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఈనెల 25న బాపట్ల క్రిస్టియన్ భవన్‌లో మాలల ధూమ్-ధామ్ సభను నిర్వహిస్తున్నామని సభకు మాలలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు చల్లాపల్లి కోటేశ్వరరావు, గొర్రెముచ్చువందనంపాల్గొన్నారు.

డాక్టర్ ఇనజకుమారి సేవలు అభినందనీయం

బాపట్ల,ఫిబ్రవరి 3 : రోగులకు విశేషమైన సేవలందిస్తున్న డాక్టర్ ఇనజకుమారి సేవలు అభినందనీయమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు మద్దిబోయన తాతయ్య పేర్కొన్నారు. జాతీయ మహిళా వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బాపట్ల బ్యాంక్ కాలనీలోని వైద్యశాలలో ఇనజకుమారిని శనివారం ఘనంగా సత్కరించి సన్మానించారు. కార్యక్రమానికి సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా పేదప్రజలకు డాక్టర్ ఇనజకుమారి వైద్యసేవలందించి ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు కంకణాల బాలమ్మ, మారం రవికుమార్, అంగలకుదురు నటరాజన్, ఎన్ఎస్‌పి రాజు, డాక్టర్ ఫణికుమార్, శైలజ, బుల్లిబాబు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

బాపట్ల, ఫిబ్రవరి 3 : ప్రముఖ సినీనటుడు, మెగాస్టార్ చిరంజీవికి పద్మవిభూషణ్ వచ్చిన సందర్భంగా అభిమాన సంఘనాయకులు విష్ణుమొలకల చంద్రమోహన్ ఆధ్వర్యంలో శనివారం బాపట్ల ఏరియా వైద్యశాలలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరంజీవి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.సిద్దార్థ, తిమ్మన శేషు, మాడా రామకృష్ణ, చిరంజీవుల లక్ష్మణ్, నరసింహ, కాపుసంక్షేమ సేన జిల్లా అధ్యక్షులు మాడసాని బాలాజి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టిసారించిన కమిషనర్

బాపట్ల,ఫిబ్రవరి 3 : బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన కె.రామచంద్రారెడ్డి శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. నిత్యం వార్డులో పర్యటించి శానిటేషన్ సిబ్బందిని పరుగులు పెట్టిస్తున్నారు. రోడ్ల పక్కనే ఎక్కడ చెత్తాచెదారం కనిపించరాదని సూచించారు. డ్రైనేజిలలో సిల్ట్ తొలిగించటంతోపాటు వ్యర్థాలు వేరి వేయాలని ఆదేశించారు. ప్రతిరోజు ఉదయాన్నే వార్డులన్ని పరిశుభ్రం చేయాలన్నారు. అధికారులు పర్యవేక్షిస్తూ పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ ఉమామహేశ్వరరావు, శానిటరి ఇన్‌స్పెక్టర్‌లు పాల్గొన్నారు.

ఇంటి స్థలం చూపించాలంటూ లబ్ధిదారుల ప్రదక్షిణలు

కొల్లూరు, ఫిబ్రవరి 3 : మంజూరైన ఇంటి స్థలం చూపించాలంటూ లబ్ధిదారులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మండల పరిధిలోని ఆవులవారిపాలెం గ్రామానికి చెందిన విపర్ల మరియరాణి, గడ్డం లక్ష్మీ పేరిట కొల్లూరు లేఅవుట్‌లో ఇంటి స్థలాలు మంజూరయ్యాయి. ఆయా స్థలాలకు సంబంధించి పట్టాలు సైతం అధికారులు పంపిణీ చేశారు. కానీ ఇప్పటి వరకు కేటాయించిన స్థలాలను వారికి చూపించలేదు. తమ స్థలాల్లో గృహ నిర్మాణం చేసుకుంటామని చెబుతున్నా ఎవరూ స్పందించడం లేదని, తమతో పాటు తమ గ్రామంలో మరికొందరి పరిస్థితి కూడా ఇదేనని వారికి మంజూరైన స్థలాలు ఎక్కడున్నాయో వారికి కూడా తెలియదని లబ్దిదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు చొరవ తీసుకుని తమకు కేటాయించిన స్థలాలను చూపించాలని కోరుతున్నారు.

విశ్వహిందుపరిషత్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలి

బాపట్ల,ఫిబ్రవరి 3 : విశ్వహిందుపరిషత్ కమిటీ సభ్యుల సమావేశం శ్రీ సోమేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. సమావేశంలో బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విశ్వహిందుపరిషత్ కార్యక్రమాలను ఫిబ్రవరి నెలలో విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో మద్దుల వెంకటేశ్వర్లు, భైరాపట్నం సింగారావు, విచారపు మునేశ్వరరావు, సాయిన కొండలు, బండ్రెడ్డి రజనీ, గృహలక్ష్మీ, లక్ష్మీ సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

మందకొడిగా ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్లు

● సచివాలయాల వద్ద మహిళల పడిగాపులు

కొల్లూరు, ఫిబ్రవరి 3 : జగనన్న లేఅవుట్లలో కేటాయించిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మందకొడిగా సాగుతుంది. తమ స్థలాలను రిజిస్ట్రేషన్ చేయించేందుకు సచివాలయాల వద్ద మహిళలు గంటల కొద్ది పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. కొల్లూరు మండలంలో 16 సచివాలయాల పరిధిలో మొత్తం 2434 మంది లబ్దిదారులు జగనన్న లేఅవుట్లలో ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఆయా స్థలాలకు ప్రభుత్వం లబ్దిదారుల పేరిట రిజిస్ట్రేషన్లు చేయడం ప్రారంభించింది. కొల్లూరు మండలంలో మాత్రం ఈ నెల 2వ తేదీ నుంచి సచివాలయాల్లో లబ్దిదారులకు స్థలాలు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టింది. శుక్ర, శనివారాల్లో 16 సచివాలయాల్లో చినపులివర్రు సచివాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కాలేదు. మిగిలిన 15 సచివాలయాల్లో కేవలం 260 మంది లబ్దిదారులకు స్థలాల రిజిస్ట్రేషన్ జరిగింది. అంటే సగటున రోజుకు ఒక్కో సచివాలయంలో కేవలం 8, 9 మంది లబ్దిదారులకు మాత్రమే రిజిస్ట్రేషన్ జరుగుతుంది. దీనికి అధికారులు సర్వర్ సమస్యలు ఉన్నాయని అందుకే రిజిస్ట్రేషన్ ఆలస్యం అవుతుందని చెబుతున్నారు.

● వేమూరు, ఫిబ్రవరి 3 : ప్రభుత్వం పేదలకు ఇంటి స్థలాల నిమిత్తం పంపిణీ చేసిన జగనన్న కాలనీలలోని లబ్ధిదారులకు సచివాలయాలలో రిజిస్ట్రేషన్ కార్యక్రమాలను చురుకుగా నిర్వహిస్తున్నారు. వేమూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో 12,677మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వేమూరు మండలంలో 3005, కొల్లూరు మండలంలో 2670, అమర్తలూరు మండలంలో 3199, చుండూరు మండలంలో 1930మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గ్రామ పంచాయితీల కార్యదర్శుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతుంది.

ముగిసిన శ్యామ్‌ప్రసాద్ అంత్యక్రియలు

బాపట్ల, ఫిబ్రవరి 3 : భారతీయ జనతాపార్టీ యువమోర్చా రాష్ట్ర కోశాధికారి బి.కృష్ణచైతన్య తండ్రి బి.శ్యామ్‌ప్రసాద్ అంత్యక్రియలు పిట్టలవానిపాలెం మండలం అల్లూరు గ్రామంలో శనివారం జరిగాయి. అంత్యక్రియలలో మాజీ ఎమ్మెల్సీ బీజేపీ నాయకులు అన్నంసతీష్ ప్రభాకర్ పాల్గొన్నారు. శ్యామ్‌ప్రసాద్ మృతికి సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. భౌతికకాయాన్ని సందర్శించి సంతాపం ప్రకటించిన వారిలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గంటా అంజిబాబు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు దోనేపూడి దేవరాజు, ప్రముఖ బిల్డర్ గంటా నవీన్, బక్కా రోశయ్య, బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షులు యార్లగడ్డ లక్ష్మీ నారాయణ, సీనియర్ నాయకులు పురిగల్ల రఘురాం, కర్లపాలెం జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు. అదేవిధంగా మాజీ ఎంపీ శ్రీరామ్‌మాల్యాద్రి, మాజీ ఎమ్మెల్యే మంతెన అనంతవర్మ, రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహం, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తదితరులు ఫోన్ చేసి కృష్ణచైతన్యను పరామర్శించారు.



కృష్ణచైతన్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న అన్నం సతీష్ ప్రభాకర్ తదితరులు

జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగికి గుండెపోటు

● ఆసుపత్రికి తరలించిన ఉపాధ్యాయులు

బాపట్ల,ఫిబ్రవరి 3 : జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న షేక్ బాషా శనివారం గుండెపోటుతో కార్యాలయంలో కుప్పకూలి పడ్డాడు. ఆ సమయంలో కార్యాలయానికి పనిపై వచ్చిన ఉపాధ్యాయుడు గురజాల శ్రీనివాసరావు ప్రథమ చికిత్స సీపీఆర్ చేసి ప్రాణాలు నిలబెట్టారు. వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్ళి వైద్యం చేయించి ప్రాణాలను కాపాడారు. కార్యాలయ సిబ్బంది, బాషా కుటుంబ సభ్యులు శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీ

● కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలు

బాపట్ల,ఫిబ్రవరి 3 : జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కట్టా శ్రీనివాసరావు తన బావమరిది పాలపర్తి ఉమామహేశ్వరరావుతో కలిసి కడకుదురు బైక్‌పై వెళుతుండగా ఎదురొచ్చిన ఏపి07సిబి1836 అనే నెంబరు గల బైక్ గ్యాస్ గోదాం వద్ద ఢీకొట్టినట్లు పట్టణ ఎస్సై రాంబాబు తెలిపారు. ఈ సంఘటనలో కానిస్టేబుల్ శ్రీనివాసరావుకు తీవ్రగాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించి గుంటూరు తరలించారు. బావమరిది ఉమామహేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆసోదివారిపాలెంలో దుప్పట్లు పంపిణీ

బాపట్లరూరల్, ఫిబ్రవరి 3 : బాపట్ల మండలం ఆసోదివారిపాలెం గ్రామంలో పెన్షన్‌దారులకు శనివారం కోన ప్రభాకరరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోన రఘుపతి దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వీఏఏ బలవన్మరణం దారుణం

కర్లపాలెం,ఫిబ్రవరి 3 : అధికారుల నుంచి వచ్చిన ఒత్తిడి తట్టుకోలేక రైతు భరోసాకేంద్రంలోని వీఏఏగా పని చేస్తున్న పూజిత బలవన్మరణానికి పాల్పడటం బాధాకరమని కర్లపాలెం మండల వ్యవసాయాధికారులు అన్నారు. శనివారం కర్లపాలెం మండలం వ్యవసాయాధికారి కార్యాలయంలో పూజిత చిత్రపటానికి వ్యవసాయాధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యవసాయాధికారులు మాట్లాడుతూ చావలి గ్రామం రైతు భరోసాకేంద్రంలో వీఏఏగా పనిచేస్తున్న పూజిత పాడైపోయిన ఎరువుల అమ్మకం విషయమై అధికారుల నుంచి వచ్చిన ఒత్తిడిని తట్టుకోలేక బలవన్మారణానికి పాల్పడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు పాల్గొన్నారు

● చుండూరు, ఫిబ్రవరి 3 : రైతు భరోసా కేంద్రాలు అధికార పార్టీ నాయకుల దోపిడికి అడ్డాగా మార్చుకున్నారని రాష్ట్ర గ్రామ వ్యవసాయ సహాయకుల సంఘం సభ్యులు ఆరోపించారు. శనివారం చుండూరు వచ్చిన జిల్లా వ్యవసాయ అధికారిణి నిర్మలకు చావలి ఆర్‌బీకే ఉద్యోగిని బెల్లంకొండ పూజిత ఆత్మహత్యకు కారణమైన వారిపై విచారించి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞాపన పత్రం అందించారు. సంఘ ఉపాధ్యక్షులు మణికంఠ మాట్లాడుతూ ఆర్‌బీకేలలో తరచూ ఉద్యోగులపై స్థానిక అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్ళు, కొన్ని చోట్ల ఆర్‌బీకేలలో ఎరువులు నిల్వ ఉంచుకోవడానికి కూడా తగిన గోడౌన్ సౌకర్యం లేకపోవడంతో సొంత డబ్బులతోనే గోడౌన్ అద్దెలు కూడా ఉద్యోగులే చెల్లించుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కొన్ని గోడౌన్‌ల్లో సరైన సౌకర్యాలు లేక వర్షానికి, ఇతర కారణాలతో ఎరువుల నిల్వలు పాడైపోతే వాటి ఖరీదు కూడా సిబ్బందే చెల్లించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు విజయానరేంద్ర, భాస్కర్, రాకేష్, వీఏఏలు పాల్గొన్నారు.



చుండూరులో వినతిపత్రం అందిస్తున్న ఆర్‌బీకే ఉద్యోగులు

వేగ నియంత్రణతో రోడ్డు ప్రమాదాల నివారణ

● రవాణా శాఖ సంయుక్త కమిషనర్ శ్రీకృష్ణవేణి

కొల్లూరు, ఫిబ్రవరి 3 : వాహనాల వేగ నియంత్రణ ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని రవాణా శాఖ సంయుక్త కమిషనర్ బి.శ్రీకృష్ణవేణి అన్నారు. కొల్లూరులోని వేంకటేశ్వర ఏజెన్సీ పెట్రోల్ బంకులో శనివారం 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేగ నియంత్రణ ద్వారా రోడ్డు ప్రమాదాలు అరికట్టవచ్చని, వాహన చోదకులు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు జరిగినా తలకు గాయాలు కాకుండా ఉపయోగపడుతుందన్నారు. రోడ్డు ప్రమాదాలకు గురైన వారిని ప్రథమ చికిత్స ఎలా చేయాలి అనే ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. లారీ యజమానులు తమ వాహనాల ఫిట్‌నెస్ కోసం బాపట్ల రావాలంటే దూరభారం అయ్యిందని, రేపల్లెలో వాహనాల ఫిట్‌నెస్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ విషయంపై ఉన్నతాధికారులతో చర్చించి సాధ్యసాధ్యాలను బట్టి నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. తెనాలి స్టేట్‌బ్యాంకు చీఫ్ మేనేజర్ కెవి భరద్వాజ్ సమావేశానికి హాజరై తమ శాఖ ద్వారా వాహనాల కొనుగోలు రుణాలు మంజూరు చేస్తామని ఆసక్తి గల వారు సంప్రదించాలని సూచించారు. సదస్సులో ఫిజికల్ ట్రైనర్ శ్రీమన్నారాయణ, వైద్యులు నరేంద్ర, రవాణా శాఖ ఇన్‌స్పెక్టర్లు లక్ష్మీప్రసన్న, అంకమ్మరావు తదిరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవాణా శాఖ సంయుక్త కమిషనర్ శ్రీకృష్ణవేణి

ఆరు ఉన్నత పాఠశాలలకు కేంద్ర నిధులు విడుదల

● సమగ్ర శిక్ష అభియాన్ ఏఈ పవన్



ఏఈ పవన్

వేమూరు, ఫిబ్రవరి 3 : నియోజకవర్గంలోని ఆరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలకు ప్రధాన మంత్రి స్కీం ద్వారా రూ.40.55 లక్షల నిధులు విడుదలైనట్లు సమగ్ర శిక్ష అభియాన్ ఏఈ పవన్ తెలిపారు. ఆయన శనివారం వేమూరు మండలంలో పర్యటించినప్పుడు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ మండలంలోని జంపని, కొల్లూరు మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల, అమర్తలూరు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, చుండూరు మండలం ఎడ్లపల్లి, భట్టిప్రోలు మండలం ఐలవరం పాఠశాలల్లో క్రీడా ప్రాంగణాల అభివృద్ధి పనుల నిమిత్తంగా ఒక్కొక్క దానికి రూ.5లక్షల చొప్పున ఐదు పాఠశాలలకు రూ.25లక్షలు కేటాయించారని తెలిపారు. మొదటి విడతగా ఆయా పాఠశాలల బ్యాంకు ఖాతాలకు రూ.లక్ష చొప్పున జమ చేశారని అన్నారు. అమృతలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కెమిస్ట్రీ ల్యాబ్ నిర్మాణం కోసంగా రూ.15.55 లక్షలు కేటాయిస్తూ మొదట విడతగా రెండు లక్షలు జమ చేసినట్లు వివరించారు. సంబంధిత పనులను వారంలోగా ప్రారంభిస్తున్నట్లు వివరించారు.

నవరత్నాలను నకిలీరత్నాలుగా మార్చిన జగన్ : తాడిపర్తి

రేపల్లె, ఫిబ్రవరి 3 : ఆడపడుచులకు 2019లో జగన్‌రెడ్డి మీఅన్నగా ఉంటానని చెప్పి మాట మార్చి మోసం చేశారని రాష్ట్ర టీడీపీ బీసీ పద్మశాలీయ స్టేట్ డైరెక్టర్ తాడిపర్తి మల్లికార్జున్‌రావు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మద్య నిషేధం అమలు చేస్తానని మాట ఇచ్చి మరిచారన్నారు. ఒక్క ఛాన్స్ అని చెప్పి అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని అస్తవ్యస్తంగా మార్చారన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయని, సామాన్యుడు బతికే పరిస్థితి లేదన్నారు. ఆర్టీసీ, పెట్రోల్, డీజీల్, విద్యుత్, నిత్యావసర వస్తువులు విపరీతంగా పెరిగిపోయాయని ప్రజలు రానున్న ఎన్నికల్లో ఓటుతో జగన్‌రెడ్డికి బుద్ధిచెప్పేందుకు సిద్ధమయ్యారన్నారు.

6న ఛలో అసెంబ్లీ ముట్టడిని విజయవంతం చేయాలి



యలవర్తి లక్ష్మీ

రేపల్లె, ఫిబ్రవరి 3 : రాష్ట్రంలో 12,918 గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం 14, 15 ఆర్థిక సంఘం ద్వారా పంపిన 8,629 కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం దొంగిలించి దారి మళ్ళించిందని వెంటనే తిరిగి సర్పంచ్‌ల ఖాతాల్లో జమ చేయాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి యలవర్తి లక్ష్మీ అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ సర్పంచ్‌ల 16 డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల 6వ తేదీ ఛలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించి అసెంబ్లీని ముట్టడిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గతంలో మాదిరిగా గ్రామపంచాయతీలకు రాష్ట్రప్రభుత్వం ఉచిత విద్యుత్ ఇవ్వాలని, సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు రూ.15 వేలు, ఎంపీపీ, జడ్పీటీసీలకు రూ.30 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఇంజనీరింగ్ కార్మికులకు సరైన వేతనాలివ్వాలి

రేపల్లె, ఫిబ్రవరి 3 : ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమి స్కిల్డ్ జీతాలు అమలు చేయాలని, పండుగ కానుక రూ.వెయ్యి ఇవ్వాలని సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సిహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్‌రెడ్డికి ఇంజనీరింగ్ కార్మికులు, సీఐటీయూ నాయకులు సమస్యలు పరిష్కారం కోరుతూ వినతిపత్రాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇంజనీరింగ్ కార్మికులు అనేక సంవత్సరాల తరబడి పనిచేసినప్పటికి ప్రభుత్వం సరైన వేతనాలు అమలు చేయకపోవటం వల్ల తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.రవిబాబు, కె.రాఘవేంద్రరావు, బి.యువరాజు, కె.మనోబాబు, వి.శ్రీనివాసరావు, ఎ.సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే ధ్యానంపై అవగాహన పెంచుకోవాలి

నగరం, ఫిబ్రవరి 3 : ప్రస్తుత తరుణంలో ఆరోగ్యంపై ప్రతి ఒక్క విద్యార్థి శ్రద్ధ వహించాలని ధ్యాన ప్రక్రియను అలవాటు చేసుకోవాలని శ్రీధర్ అన్నారు. శనివారం మండలంలోని పెద్దవరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ధ్యానం, యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నారాయణ, గ్రామ పెద్దలు కోటేశ్వరరావు, పూర్ణయ్య పాల్గొన్నారు.

అధిష్ఠానం ఆదేశిస్తే బాపట్ల నుంచి పోటీచేస్తా!

» కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం

పంగులూరు, ఫిబ్రవరి 3: పార్టీ అధినాయకత్వం అంగీకరిస్తే బాపట్ల పార్లమెంటరీ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తానని కేంద్ర మాజీమంత్రి జేడీ శీలం అన్నారు. వ్యక్తిగత పనిపై శనివారం పంగులూరు వచ్చిన ఆయన మాట్లాడుతూ బాపట్ల నియోజకవర్గ ప్రజలతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేశారు. రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా పనిచేసిన సమయంలో అనేక ప్రజాప్రయోజన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. వందల సంఖ్యలో సామాజిక భవనాలు, స్వచ్ఛమైన తాగు నీరందించే ఆర్వో ప్లాంట్లు నిర్మించి గ్రామ పంచాయతీలకు అప్పగించినట్లు చెప్పారు. కష్ట జీవులకు దక్కాల్సిన ఆర్థిక ప్రయోజనాలను కార్పొరేట్ సంస్థల యజమానులకు కట్టబెడుతున్న కేంద్ర పాలకుల విధానాలను తప్పుబట్టారు. రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతుందని, ఎస్సీ, ఎస్టీ లకు ప్రయోజనం చేకూర్చే 26 పథకాలను రద్దు చేసిన జగన్మోహనరెడ్డి, తానే దళిత, గిరిజనులకు మేలు చేకూర్చుతున్నట్లు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలని కోరారు.

12 మంది సెయింట్ ఆన్స్ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

చీరాల, ఫిబ్రవరి 3: సెయింట్ ఆన్స్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 12 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా శనివారం కళాశాలలో నిర్వ హించిన కార్యక్రమంలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మొయిద వేణుగోపాలరావు మాట్లా డుతూ విద్యార్థులు ఎప్పటికప్పుడు తమ నైపుణ్యానికి పదును పెట్టుకోవాల్సిన ఆవశ్యతను వివరించారు. కార్యక్రమంలో ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇష్టమైన రంగంలో ఉన్నతస్థాయికి ఎదగాలి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 3: విద్యార్థులు తమకు ఇష్టమైన రంగంలో కృషితో ఉన్నత స్థాయికి ఎదగాలని పీజీఎన్ఎఫ్ ప్రతినిధులు, ఈఎన్‌టీ డాక్టర్ కొర్రపాటి సుధాకర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్(యూఎస్ఐ) గుళ్లపల్లి శ్రీనివాస్‌లు అన్నారు. శనివారం మండలంలోని చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రకాశం గ్లోబల్ ఎన్ఆర్ఐ ఫోరం(పీజీఎన్ఎఫ్) ఆధ్వర్యంలో 22 సైకిళ్లతో సైకిల్ బ్యాంక్ ఏర్పాటు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. పుస్తకాలు చదవడం ద్వారా విద్యార్థులలో అనేక మార్పులు వస్తాయన్నారు. పీజీఎన్ఎఫ్ అందించిన పుస్తకాలను విద్యా ర్థులు సద్వినియోగపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కేవీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆపన్నులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండయ్య

చీరాల, ఫిబ్రవరి 3: ఆపన్నులకు అండగా ఉంటామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య అన్నారు. మండల పరిధిలోని బుర్లవారిపాలెం కాలువ కట్టపై ఉన్న యానాదులను శనివారం ఆయన నాయకులు, కార్యకర్తలతో కలసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఆపన్నహస్తం అందించేందుకు టీడీపీ ముందు వరుసలో ఉంటుందన్నారు. చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావాలన్నారు. అందుకు ప్రతిఒక్కరూ ఓటుతో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో నక్క మరియమ్మ, గున్నం పద్మ, లక్ష్మి, రమణమ్మ, లక్ష్మయ్య, వెంకన్న, మోహన్‌గౌడ్, కొమ్మనబోయిన రజిని, గంజి పురుషోత్తమ్, గజవల్లి శ్రీనివాసరావు, రత్నబాబు, అడ్డగడ్డ రామయ్య, కట్టెం వంశీకృష్ణ, తేలప్రోలు నాగేశ్వరరావు, కౌతవరపు జనార్దనరావు, గుత్తికొండ కిషోర్ పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో విద్యా వ్యవస్థ సర్వనాశనం

» నిరుద్యోగులను మోసం చేస్తున్న ప్రభుత్వం
» ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు దగా డీఎస్సీ
» ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ధ్వజం



రవికుమార్

అద్దంకి, ఫిబ్రవరి 3: డీఎస్సీ పేరుతో వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను దగా చేస్తుందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ధ్వజమెత్తారు. మెగా డీఎస్సీ ఇస్తామని చెప్పిన వైసీపీ ప్రభుత్వం కాలయాపన చేసి తీరా ఎన్నికల సమయం వచ్చేసరికి ఇప్పుడు ప్రకటిస్తుందని చెప్పారు. ఈమేరకు శనివారం ఆయన ఓప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 50,896 ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల సమయంలో లబ్ధి పొందేందుకు మెగా డీఎస్సీ అని చెప్పి ఐదేళ్ళు తాడేపల్లి ప్యాలెస్‌లో నిద్రపోయి, ఎన్నికలకు ముందు 6,100 పోస్టులకు అనుమతి ఇవ్వటం ఏమిటని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో విద్యావ్యవస్థ సర్వనాశనం అయ్యిందన్నారు. సీఎం సభ కోసం ఇంటర్మీడియట్ ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షను రాష్ట్రవ్యాప్తంగా వాయిదా వేశారన్నారు. ఏలూరు జిల్లా దెందులూరులో సీఎం సభకు విద్యార్థులను పెద్దఎత్తున తరలించేందుకు విద్యాలయాలకు సెలవు ప్రకటించారన్నారు. కళాశాల యాజమాన్యాలను అధికారులతో బెదిరించి బస్సులను బలవంతంగా తీసుకోవటం హేయమైన చర్య అని అన్నారు. వచ్చే ఎన్నికలలో జగన్‌రెడ్డి ఓటమే లక్ష్యంగా యువత పనిచేయాలని పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడ్డా దాని మూలాలు ఏపీలోనే ఉండటం జగన్‌రెడ్డి అరాచకపాలన కు నిదర్శనమన్నారు. గంజాయి రవాణా వైసీపీ నేతలు, అధికారుల కనుసన్నలలో జరుగుతుందన్నారు. టీడీపీ పాలనలో రాష్ట్రం పెట్టుబడులకు హబ్ గా ప్రథమస్థానంలో ఉంటే, వైసీపీ పాలనలో గంజాయి రవాణాలో ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు పూర్వ వైభవం రావాలంటే టీడీపీ, జనసేన ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే రవికుమార్ పేర్కొన్నారు.

అక్రమ కేసులు పెట్టినా అదరం బెదరం

» ప్రశాంతతకు భంగం కలిగిస్తే ఊరుకోం
» టీడీపీ నేతల హెచ్చరిక



మార్టూరులోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు


మార్టూరు, ఫిబ్రవరి 3: అక్రమంగా కేసులు పెట్టినా భయపడేది లేదని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. అక్రమ దందా చేస్తూ మార్టూరులోని కష్టాన్ని రోజు కరెన్సీ రూపంలో ఎత్తుకుపోతున్నా కళ్లు మూసుకున్న నాయకులు కళ్లు తెరవాలన్నారు. ప్రశాంతకు మారుపేరైన పర్చూరు నియోజకవర్గంలో అలజడి సృష్టించి, అభివృద్ధికి మార్గదర్శకుడైన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుపై దుష్ప్రచారం చేసే వారిపై తీవ్ర పరిణామాలు ఉంటాయని టీడీపీ మండల నాయకులు హెచ్చరించారు. గతనెల 30న మార్టూరులో టీడీపీ నాయకుడు కామినేని జనార్దన్‌కు చెందిన అనంత గ్రానైట్‌లో జరిగిన గొడవలో నెల్లూరు విజిలెన్స్ అధికారి బాలాజీ నాయక్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈమేరకు పోలీసులు అరెస్టుచేసిన ఆరుగురు గ్రానైట్ పరిశ్రమల యజమానులకు శనివారం ఒంగోలు జైలు నుంచి బెయిల్‌పై విడుదలై వచ్చారు.

ఈసందర్భంగా మార్టూరులోని పార్టీ కార్యాలయంలో బెయిల్‌పై వచ్చిన నాయకులతో పాటు మండలంలోని నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. న్యాయం గెలిచిందని, టీడీపీ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. కేవలం టీడీపీకి చెందిన గ్రానైట్ పరిశ్రమలలో అధికారులు తనిఖీలు చేయడం ఎంతవరకు సబబని అడిగిన పరిశ్రమల యజమానులపై అధికారుల చేత అధికారపార్టీ వారు అక్రమంగా కేసులు పెట్టించడం నీచ సంప్రదాయమన్నారు. పర్చూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేసిన అభివృద్ధి ప్రజలకు కనిపిస్తుందని చెప్పారు. సదరు వైసీపీ నాయకుడు మార్టూరు గ్రామంలో ఒక్క అభివృద్ధి పని చేశారా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును విమర్శించే అర్హత ఎవరికీ లేదన్నారు. ఎంతో మంది కార్మికులకు ఉపాధిని కల్పిస్తున్న గ్రానైట్ పరిశ్రమలకు అధికారులు ప్రయివేటు వ్యక్తులతో ముఖ్యంగా వైసీపీకి చెందిన వ్యక్తితో మారణాయుధాలుతో తనిఖీలకు రావడం కక్షపూరిత చర్య కాదా అని ప్రశ్నించారు. అదేమిటని అడిగినందుకు, ప్రజాప్రతినిధిగా అక్కడకు వచ్చిన ఎమ్మెల్యే ఏలూరిపై అక్రమంగా కేసులు పెట్టడం రాజకీయ ప్రతీకారచర్య కాదా అని ప్రశ్నించారు. తాము పెట్టిన కేసును ఇంతవరకు పోలీసులు నమోదు చేయడానికి కారణం అధికార పార్టీ ఒత్తిడులు కాదా అని పేర్కొన్నారు. పర్చూరు నియోజకవర్గంలో రౌడీ రాజకీయాలు చేస్తే ప్రజలు ఊరుకోరని అన్నారు. ప్రజానీకం తిరుగుబాటు చేసే సమయం ఆసన్నమయిందని నాయకులు స్పష్టం చేశారు.

కార్యక్రమంలో కామినేని జనార్దన్, మిన్నెకంటి రవికుమార్, అడుసుమల్లి వెంకట శ్రీనివాసరావు, తొండెపు ఆదినారాయణ, మక్కెన శేఖర్‌బాబు, శివ, దాసం అశోక్ కుమార్, జంపని శ్రీనివాసరావు, రావినేని శ్రీనివాసులు, ఉప్పుటూరి రమాదేవి, గొట్టిపాటి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.


వైసీపీ నేత భార్యకు రెండు చోట్ల ఓట్లు

» టీడీపీ వర్గీయులు ఏడుగురికి ఒకేచోట ఉన్నా రెండోసారి ఫాం 7 అందజేత
» అధికారులు విచారణ చేసి స్థానికులే అని నిర్ధారించినా మరలా ఫిర్యాదులు



253
ఓటరు పేరు : సుప్రియ సూదనగుంట
తండ్రి పేరు: శ్రీనివాసరావు సూదనగుంట
ఇంటి సంఖ్య : 3-172
వయస్సు : 23 లింగము : స్త్రీ

ఒంగోలులో ఉన్న సూదనగుంట సుప్రియ ఓటు



ఓటరు పేరు : సుప్రియ సుదనగుంట
భర్త పేరు: అశోక్ బాబు ఉన్నం
ఇంటి సంఖ్య : 1-107/ఏ
వయస్సు : 23 లింగము : స్త్రీ

కొటికలపూడిలో ఉన్న సుప్రియ ఓటు

అద్దంకి, జనవరి 3: వైసీపీ గ్రామస్థాయి నేత భార్యకు రెండుచోట్ల ఓటు హక్కు ఉన్నా.. అదే నేత టీడీపీ వర్గీయులకు చెందిన ఏడుగురిపై ఫాం7లు అందజేయటం పట్ల టీడీపీ వర్గీయులు మండిపడుతున్నారు. అద్దంకి మండలంలోని కొటికలపూడికి చెందిన సూదనగుంట సుప్రియకు కొటిక లపూడిలోని 194వ బూత్‌లో ఓటు హక్కు ఉంది. ఆమె పుట్టిల్లు అయిన ఒంగోలు నగరంలోని 10వ నెంబరు బూత్‌లోనూ ఓటు ఉంది. సుప్రియ భర్త ఉన్నం అశోక్‌బాబు వైసీపీ నేతగా చెలామణి అవుతూ అదే గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులుగా ఉన్న ఏడుగురిపై తన తోపాటు మరో వ్యక్తి ద్వారా ఫాం 7 ఇచ్చారు. మొదటి విడతలో ఫాం 7లను ముగ్గురు అధికారుల బృందం విచారణ చేసి ఫిర్యాదులు తప్పుడువిగా నిర్ధారించి ఓటు హక్కు కల్పించినట్లు సర్పంచ్ పూనాటి వి క్రమ్ తెలిపారు. మరలా వీరిపై రెండోసారి ఫాం7 లు దరఖాస్తు చేయటం పట్ల టీడీపీ వర్గీయులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ సానుభూతిపరులకు రెండు చోట్ల ఓట్లు ఉన్నాయని, టీడీపీ వర్గీయులకు ఒక్క చోట మాత్రమే ఓటు హక్కు ఉన్నప్పటికి ఫాం7 లు పదేపదే ఇవ్వటం ఏమిటని, అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేసి తప్పుడు ఫిర్యాదులు చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అక్రమార్కులను వదిలి ఎమ్మెల్యేపై కేసులా!



విలేకరుల సమావేశంలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు

కారంచేడు(పర్చూరు), ఫిబ్రవరి 3: అక్రమ కేసులతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రతిష్ఠను తగ్గించలేరని ఏఎంసీ మాజీ ఛైర్మన్ యార్లగడ్డ అక్కయ్య చౌదరి అన్నారు. శనివారం కారంచేడు మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్టూరు గ్రానైట్ పరిశ్రమలలోకి అధికారులతో వచ్చిన వైసీపీ రౌడీ మూకలను వదిలి ఎమ్మెల్యే ఏలూరిపై కేసులు పెట్టడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. గత నాలుగున్నర ఏళ్ళగా వైసీపీ నేత కనుసన్నల్లోనే అవినీతి రాజ్యమేలు తుందన్నారు. సదరు నేత వచ్చిన తరువాత అక్రమాలు, అరాచకాలకు అడ్డులేకుండా పోయిందని విమర్శించారు. మార్టూరు గ్రానైట్ యజమానులపై, తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులపై కేసులు పెట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా ఎమ్మెల్యే ఏలూరి రానున్న ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధించటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో కంభంపాటి నరేంద్ర, పాతూరి ఆదిలక్ష్మి, పాతూరి శివరాం, బోయిన శ్రీను, ఆంజనేయులు, గద్య సుబ్బయ్య, శ్రీను, కొల్లా భాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

చీరాలలో ఆమంచికి షాక్

» వెంకటేష్‌కు మద్దతు తెలిపిన ముఖ్యఅనుచరులు



వెంకటేష్‌కు మద్దతు తెలుపుతున్న ఆమంచి ముఖ్యఅనుచరులు

చీరాల, ఫిబ్రవరి 3: చీరాల నియోజకవర్గంలో రాజకీయ సమీరణాలు మారుతున్నాయి. ఆమంచి కృష్ణమోహన్‌కు అత్యంత సన్నిహితంగా మెలిగే కొందరు శుక్రవారం రాత్రి ఒంగోలులో వైసీపీ నియోకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్‌ను కలిశారు. వచ్చే ఎన్నికల్లో పూర్తిస్థాయిలో తనకు మద్దతుగా పనిచేస్తామని చె ప్తూ బొకే అందజేశారు. ఆమంచికి అత్యంత ఆంతరంగికులుగా గుర్తింపు పొందిన పైడి రాజేష్, గరికపాటి సుధీర్, కౌన్సిలర్ సల్లూరి సత్యానందం తదితరులు మద్దతు తెలపటం ప్రస్తుతం రాజకీయంగా అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈక్రమంలో భవిష్యత్ రాజకీయపై ఈ కలయిక ఎలా ఉంటుందనే విషయంలో రాజకీయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

అభివృద్ధిలో ముందుండి పనిచేయండి

చీరాల, ఫిబ్రవరి 3: మున్సిపల్ పరిధిలో ఎవరికి ఏ అవసరం వచ్చినా అభివృద్ధిలో ముందుండి పనిచేయాలని కమిషనర్ విజయసారథికి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ చెప్పారు. చీరాల మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన విజయసారథి ముందుగా స్థానిక అధికారులు, సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. అనంతరం వెంకటేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ పురప్రజలకు మెరుగైన సేవలు అందించటమే లక్ష్యంగా పనిచేయాలని చెప్పారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు

» పట్టించుకోని అధికారులు



అధికారులు పట్టించుకోకపోవటంతో యథేచ్ఛగా జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలు(ఫైల్)

చీరాల, ఫిబ్రవరి 3: చీరాల, పర్చూరు నియోజకవర్గాల పరిధిలో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. వీటిని నియంత్రించాల్సిన అధికారులు ఆవైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ ఖజానాకు గండి పడుతోంది. ఇదేమని ప్రశ్నించినవారికి సమాధానం కరువవుతోంది.

చీరాల నియోజకవర్గంలో ఇసుక అక్రమ తవ్వకాలు అడ్డూఅదుపు లేకుండా సాగుతున్నాయి. వీటిపై చర్యలు చేపట్టాల్సిన అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. వేటపాలెం మండలం పందిళ్లపల్లి సమీపంలో జరుగుతున్న ఇసుక అక్రమ క్వారీయింగ్‌పై ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. ఈనేపథ్యంలో శుక్రవారం ఇసుక అక్రమ క్వారీయింగ్‌పై జనసేన పార్టీపరంగా చేపట్టిన చర్యలను పోలీసులు అడ్డుకున్నారు. పార్టీలకు అతీతంగా చేపట్టిన ఆ చర్యను అడ్డుకోవటం ఎంతవరకు సమంజమని జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల పరిధిలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఇదేమని ప్రశ్నించిన వారికి ఎలాంటి సమాధానం రావటం లేదు. అధికార పార్టీ అడ్డదండలు అందుకు కారణంగా చెప్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు

పంగులూరు, ఫిబ్రవరి 3: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా సెక్టోరియల్ అధికారులు శనివారం పలుగ్రామాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ నిర్వహణకు ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. పంగులూరు, బూదవాడ, కల్లంవారిపాలెం, మల్లవరం, ఆరికట్లవారిపాలెం గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను సెక్టోరియల్ అధికారి కె.సుబ్బారెడ్డి, చందలూరు, నూజెళ్ళపల్లి, తూర్పుకొప్పెరపాడు, తక్కెళ్ళపాడు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను కేవీపీ కుమారి పరిశీలించారు.

అప్రంటీస్ విధానం తగదు!

మార్టూరు, ఫిబ్రవరి 3: ఉపాధ్యాయుల భర్తీకోసం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసే డీఎస్సీలో అప్రంటీస్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నట్లు స్కూల్ అసిస్టెంట్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.సర్వోత్తమ రెడ్డి, ప్రధానకార్యదర్శి చింతల సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలో ప్రకటించబోయే డీఎస్సీలో మార్చి వరకు ఖాళీలయ్యే వాటిని గుర్తించి వాటిని కూడా కలిపి వెంటనే డీఎస్సీని ప్రకటించాలన్నారు. ఎన్నికల హామీలో ఇచ్చిన సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

న్యాయవాది మృతి

చీరాలటౌన్, ఫిబ్రవరి 3: చీరాలలో ఓ న్యాయవాది శనివారం మృతిచెందాడు. పట్టణానికి చెందిన చెన్నుపాటి నాగేశ్వరరావు(60)కు భార్య, కుమారుడు ఉన్నారు. కుమారుడు అమెరికాలో ఉంటున్నాడు. వయోభారంతో ఆయన తల్లి రమాదేవి గతనెల 23న మృతిచెందడంతో ఇరువురు సోదరులతో కలిసి సంబంధిత ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే బంధువుల సౌకర్యార్థం రామాపురంలో కూడా రూములు ఏర్పాటు చేశారు. ఇదిలాఉండగా శనివారం తెల్లవారు జామున ఇంటినుండి బయటకు వెళ్లిన నాగేశ్వరరావు రామాపురం సముద్రతీరంలో విగతజీవిగా కనిపించాడు. సమాచారం అందుకున్న ఎస్సై జనార్దన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుని కుటుంబీకుల నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతిపై ఎటువంటి అనుమానాలు లేవని కుటుంబీకులు చెబుతున్నట్లు ఎస్సై తెలిపారు. గుండెపోటుతో మృతిచెంది ఉండవచ్చునని భావిస్తున్నారు. మృతి విషయం తెలియగానే పెద్ద సంఖ్యలో న్యాయవాదులు హాస్పిటల్ వద్దకు చేరుకుని కుటుంబీకులను ఓదార్చారు.

విజేతలకు బహుమతులు అందజేత

యద్దనపూడి(మార్టూరు), ఫిబ్రవరి 3: యద్దనపూడి మండలం పూనూరు జడ్పీ హైస్కూల్లో శనివారం 2011-12, 2013-14 లకు చెందిన పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో పర్చూరు డివిజన్ పరిధిలోని పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులకు టాలెంట్ టెస్ట్, క్విజ్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఈవో శ్రీనివాసులు, దివి భావనాచార్యులు విచ్చేశారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఈ క్విజ్ పోటీలలో మొదటి స్థానాన్ని బల్లికురవ జడ్పీ హైస్కూల్, రెండవ స్థానాన్ని పెద అంబడిపూడి, మూడవ స్థానాన్ని కొప్పెరపాడు హైస్కూల్ విద్యార్థులు సాధించారు. టాలెంట్ టెస్ట్ పోటీలలో మొదటి స్థానాన్ని సీహెచ్ నితిన్ (బల్లికురవ), రెండవ స్థానాన్ని ఎస్‌కే గౌస్‌బాషా (బూదవాడ), ఎస్.అనిల్ (పెద అంబడిపూడి) సాధించారు. విజేతలకు డీఈవో శ్రీనివాసులు, పూర్వవిద్యార్థులు పవన్, శశి, రాజారావు, మాధురి, లత, అరుణ చేతుల మీదగా నగదు బహుమతులు అందజేశారు.

నేడు పర్చూరులో ఆర్యవైశ్యుల సర్వసభ్య సమావేశం

పర్చూరు, ఫిబ్రవరి 3: పర్చూరులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఆర్యవైశ్యుల సర్వసభ్య సమావేశం జరుగుతుందని అధ్యక్ష, కార్యదర్శులు మామిడిపాక హరిప్రసాద్, పోలిశెట్టి గురుబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్చూరు మండల పరిధిలోని ఆర్యవైశ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

రాతి ముఖమండపం నిర్మాణానికి విరాళం

అద్దంకి, ఫిబ్రవరి 3: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖ మండపం నిర్మాణానికి తాళ్ళూరు మండలం తురకపాలెంకు చెందిన పి.అంజిరెడ్డి, కలమాల కుటుంబసభ్యులు రూ.1,01,116 శనివారం ఈవో సుభద్రకు అందజేశారు. సిబ్బంది, పూజారులు పాల్గొన్నారు.

అధికారుల ఒత్తిడి తగదు!

మేదరమెట్ల , ఫిబ్రవరి 3: ఒత్తిడితో పూజిత ఆత్మహత్యకు పాల్పడడం బాధ కలిగించిందని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు అన్నారు. శనివారం మేదరమెట్ల రైతు భరోసా కేంద్రంలో ఆత్మహత్యకు పాల్పడిన వ్యవసాయ విస్తణాధికారి బెల్లంకొండ పూజిత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేమూరు మండలం చావలిగ్రామంలో వ్యవసాయ విస్తణా ధికారిగా పనిచేస్తున్న పూజిత అధికారులు ఒత్తిడి, వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవడం బాధకలిగించిందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, విస్తణాధికారులు రాణి, సుక న్య, ప్రత్యూష, సుష్మా, మేరి, అప్రీన్, షరీఫ్, సంతోష్ శ్రీలేఖ, సంతోష్, మౌనిక,హసీనా, చినబాబు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని బైకిస్టుకు తీవ్రగాయాలు

మేదరమెట్ల, ఫిబ్రవరి 3: జాతీయ రహదారిలో తిమ్మనపాలెం వద్ద డివైడర్‌ను ఢీకొని మోటర్‌సైకిలిస్టుకు తీవ్రగాయాలయ్యాయి. శనివారం మద్దిపాడు మండలం ఏడుగుళ్లపాడు నుంచి పి.గుడిపాడు వెళ్తూ అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొనడంతో గాలి సురేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన సురేష్‌ను హైవే అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరికి తీవ్రగాయాలు

మార్టూరు, ఫిబ్రవరి 3: మార్టూరు నుంచి డేగరమూడి రోడ్డుకు వెళ్లే సర్వీసు రోడ్డులో రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో బిట్రగుంట మల్లేశ్వరరావు అనే ద్విచక్రవాహనదారుడు తీవ్రగాయాలైన సంఘటన శనివారం మధ్యాహ్నం జరిగింది. కారంచేడు మండలం కుంకలమర్రు గ్రామానికి చెందిన బిట్రగుంట మల్లేశ్వరరావు ద్విచక్రవాహనంపై మండలంలోని నాగరాజుపల్లిలో శుభకార్యక్రమానికి వస్తున్నాడు. ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనదారుడు ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడిన మల్లేశ్వ రరావును 108 వాహనంలో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమయిన మరో ద్విచక్రవాహనదారుడు వాహనంతో పాటు పరారయ్యాడు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 3: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు మధ్యాహ్నం భోజనం వండి పెట్టే కార్మికులకు చాలీచాలని వేతనాలు ఇచ్చి ప్రభుత్వం వెట్టిచాకిరి చేయిస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మధ్యాహ్నం భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు ఎమ్మార్సీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎంఈవో-1 గంగాధరరావు, ఎంఈవో -2 బి. సుధాకరరావుకు కార్మికులు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్నం భోజన పథకం కార్మికుల యునియన్ సభ్యులు ఆర్.కోటేశ్వరమ్మ, పి.భవాని, గోవిందమ్మ, పద్మ, రాణి తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లు ఎంపీడీవోగా శ్రీదేవి

ఇంకొల్లు, ఫిబ్రవరి 3: ఇంకొల్లు ఎంపీడీవో శ్రీదేవి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆమె గుంటూరు జిల్లాలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న రాజ్యలక్ష్మి బదిలీ అయ్యారు.

రెవెన్యూ సిబ్బంది నిరసన

ఇంకొల్లు, ఫిబ్రవరి 3: విశాఖపట్టణంలో విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ రమణయ్య హత్యకు గురికావడంతో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ సిబ్బంది శనివారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో డీటీ స్వర్ణగీత, లక్ష్మీకుమారి, పుష్పలత, వీఆర్వోలు, వీఆర్ఏలు, తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసిన మైనింగ్ అధికారులు

చినగంజాం, ఫిబ్రవరి 3: చినగంజాం ప్రాంతంలోని ప్రభుత్వ భూముల్లో అపరాధ రుసుం చెల్లించకుండా ఇసుక తవ్వుతున్న ఎక్స్‌కవేటర్‌ను జిల్లా మైనింగ్ అధికారులు శనివారం సీజ్ చేశారు. చినగంజాం గ్రామ అధికారి బి.దానియేలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. సర్వే నెంబర్లు 828, 829 గల భూముల్లో అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తవ్వుతున్న ఎక్స్‌కవేటర్‌ను మైనింగ్ అధికారులు పట్టుకున్నారు. జిల్లా మైనింగ్ అండ్ జియాలజీ అధికారి రాజేష్‌కుమార్ సీజ్‌చేసి చినగంజాం పోలీసుస్టేషన్‌లో అప్పగించినట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

మండలంలోని అధికార పార్టీ చెందిన నాయకుడు సర్వే నెంబర్లు 828, 829లోని ప్రభుత్వ భూములలో అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక క్వారీలను నిర్వహిస్తున్నారు. ఇసుక క్వారీల్లో ఎంతమేరకు ఇసుక తీసింది అధికారులు కొలతలు వేసినట్లు తెలుస్తుంది. ఎక్స్‌కవేటర్ డ్రైవర్ పారిపోవడంతో దానిని లారీపై తీసుకొచ్చి పోలీసుస్టేషన్‌లో ఉంచారు. మైనింగ్ అధికారులు వివరాలు చెప్పటానికి నిరాకరించారు.